RNI NO: APTEL/26/A7632

www.mahinewsindia.com

# మహి న్యూస్

MAHI NEWS

Epaper: https://epaper.mahinewsindia.com

తెలుగు దినపత్రిక



ఆంధ్రప్రదేశ్,తెలంగాణ. | సంపుటి : 01 | సంచిక : 38 | ఎడిటర్ : నీలి రామసుబ్బయ్య, | పేజిలు : 4, | వెల రూ. 2 | బుధవారం -14 - అక్టోబర్ - 2026

Published From: Guntur circulated by YSR Kadapa I Chittoor I Kurnool I East & West Godavari I Anatapuram I Krishna I Nellore I Srikakulam I Visakhapatnam I Vijayanagaram I Prakasham & Hyderabad & Telangana

# నగరపాలక సంస్థలు, పురపాలక సంఘాలకు రిజర్వేషన్లు ఖరారు

## 123 పట్టణ స్థానిక సంస్థల్లో బీసీలకు 41.. ఎస్సీలకు 16

- ★ఎస్టీలకు 4 కేటాయింపు
- ★మహిళలకు 50 శాతం సీట్లు
- ★కర్నూలు, రాజమహేంద్రవరం కార్పొరేషన్లు ఎస్సీలకు; మంగళగిరి-తాడేపల్లి ఎస్టీకి
- ★ 50 శాతం స్థానాల్లో మహిళలే గద్దెనెక్కనున్నారు. నగరపాలక సంస్థలు, పురపాలక సంఘాల్లో వార్డుల వారీ రిజర్వేషన్లు కూడా విడుదల
- ★శ్రీకాకుళం, అనకాపల్లి జిల్లాల్లో మహిళలదే పైచేయి..



అమరావతి : నగరపాలక సంస్థలు, పురపాలక సంఘాల ఎన్నికలకు రిజర్వేషన్లు ఖరారయ్యాయి. 17 నగరపాలక సంస్థల్లో మేయర్ పదవులను ఎస్టీ-1, ఎస్సీ-2, బీసీ-5, మహిళలు (జనరల్)-5, జనరల్ (అన్‌రిజర్వ్‌డ్)కు 4 కేటాయించారు. 106 పురపాలక సంఘాల్లో ఎస్టీ-3, ఎస్సీ-14, బీసీ-36, మహిళలు(జనరల్)-27, అన్ రిజర్వ్‌డ్‌కు 26 ఛైర్‌పర్సన్ పదవులు కేటాయిస్తూ సోమవారం పురపాలకశాఖ గెజిట్ విడుదల చేసింది. మొత్తం 123 నగరపాలక సంస్థలు, పురపాలక సంఘాల్లో.. మిగతా 2 లో



2లో

### మరోసారి చెపుతున్నా.. అధికారం జెన్-జీది, నాది బాల్ థాకరే పాత్ర: విజయసాయిరెడ్డి

- ●కొత్త పార్టీ ఏర్పాటుపై స్పష్టత ఇచ్చిన విజయసాయిరెడ్డి
- ●దసరా నాటికి పేరు, జెండా, ఎజెండా సిద్ధమవుతాయని ప్రకటన
- ●రెండు కుటుంబ పార్టీలపై తిరుగుబాటే తన లక్ష్యమన్న విజయసాయి
- ●గత ఎన్నికల తర్వాత వైసీపీకి దూరమైన విజయసాయి

### నామినేటెడ్ పదవుల్లో ఉన్న వారికి గుడ్ న్యూస్..

పదవీకాలం పెంచిన ఏపీ ప్రభుత్వం



2లో

- ▶▶వివిధ కార్పొరేషన్లలో నామినేటెడ్ పదవుల కాలపరిమితి పొడిగింపు
- ▶▶మరో రెండు నెలల పాటు పదవీకాలం పెంచుతూ ప్రభుత్వ ఉత్తర్వులు
- ▶▶సంక్షేమ, అభివృద్ధి పనుల కొనసాగింపు కోసమే ఈ నిర్ణయం అన్న ప్రభుత్వం

అమరావతి: ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కీలక నిర్ణయం

### జంతర్‌మంతర్ బంద్.. రామ్‌లీలాలో గళం విప్పాలంటే రోజుకు రూ.1.21 లక్షలు!



2లో

- రామ్‌లీలా మైదాన్‌లో ఒక్కరోజు బుకింగ్‌కు రూ.1.21 లక్షల వరకు ఖర్చు
- ఈ ఏడాది డిసెంబరు 29, 30, 31 తేదీల్లోనే బుకింగ్ అవకాశం
- ఉచిత నిరసన ప్రాంతంలో 150 మందికే అనుమతి
- జంతర్ మంతర్ స్థానంలో మూడు కొత్త నిరసన వేదికలు
- మైదాన్ బుకింగ్‌కు ఢిల్లీ పోలీసుల నిరభ్యంతర పత్రం తప్పనిసరి



2లో

### మోదీపై వ్యాఖ్యలు.. పరువు నష్టం కేసులో రాహుల్‌కు సుప్రీంలో తాత్కాలిక ఊరట

- పరువునష్టం కేసు విచారణపై కింది కోర్టు విచారణపై స్టే
- మహారాష్ట్ర ప్రభుత్వం, ఫిర్యాదుదారుకు నోటీసులు
- నాలుగు వారాల్లో స్పందన తెలియజేయాలని ఆదేశం



2లో

### ఎల్బీనగర్-హయత్‌నగర్ డబుల్ డెక్కర్ కారిడార్‌కు కేంద్రం గ్రీన్ సిగ్నల్

- కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీతో మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి భేటీ
- ఎల్బీనగర్-హయత్‌నగర్ డబుల్ డెక్కర్ కారిడార్‌కు ఆమోదం
- కృష్ణా నదిపై ఐకానిక్ కేబుల్ బ్రిడ్జ్‌ల నిర్మాణానికి గ్రీన్ సిగ్నల్

# సీట్ల సర్దుబాటుపై చర్చలు.. పవన్ కల్యాణ్‌తో కూటమి నేతల భేటీ

## స్థానిక సంస్థల ఎన్నికలకు సంబంధించి సీట్ల సర్దుబాటుపై కూటమిలో చర్చలు

అమరావతి: ఏపీలో స్థానిక సంస్థల ఎన్నికలకు సంబంధించి సీట్ల సర్దుబాటుపై కూటమిలో చర్చలు కొనసాగుతున్నాయి. జనసేన అధినేత, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌తో తెదేపా ముఖ్యనేతలు భేటీ అయ్యారు. తెదేపా రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు, మంత్రి నిమ్మల రామానాయుడు, జనసేన తరపున మంత్రి నాదెండ్ల మనోహర్, వంశీ కృష్ణ, చిల్లపల్లి శ్రీనివాస్ తదితరులు భేటీలో పాల్గొన్నారు. సోమవారం ముఖ్యమంత్రి చంద్రబాబుతో ఆధ్వర్యంలో చర్చలు జరిపిన నేతలు.. ఏయే చోట్ల ఏ పార్టీ తరపున అభ్యర్థులను బరిలోకి దించాలన్నదానిపై చర్చించారు. తాజాగా..



పవన్ కల్యాణ్‌తో ఆయా పార్టీల ముఖ్యనేతలు చర్చిస్తున్నారు.

### సింగరేణి కార్మికులకు దసరా ధమాకా.. ఒక్కొక్కరికి రూ.1.53 లక్షల వరకు బోనస్!

సింగరేణి పర్మినెంట్, కాంట్రాక్టు కార్మికులకు దసరా బోనస్

- కాంట్రాక్టు కార్మికులకు ఒక్కొక్కరికి రూ.5,500 చెల్లింపు
- పర్మినెంట్ కార్మికులకు లాభాల్లో 34 శాతం వాటా
- అర్హులైన పర్మినెంట్ కార్మికులకు గరిష్ఠంగా రూ.1,53,913
- పండుగకు ముందే ఖాతాల్లో బోనస్ జమ చేయనున్న యాజమాన్యం



హైదరాబాద్: దసరా పండుగ వేళ సింగరేణి కార్మికులకు తీపి కబురు అందింది. సంస్థలో పనిచేస్తున్న శాశ్వత కార్మికులతో పాటు కాంట్రాక్టు వారికీ బోనస్ ప్రకటించారు. కాంట్రాక్టు కార్మికులకు ఒక్కొక్కరికి మిగతా 2 లో



2లో

### విదేశీ శక్తులతో కలిసి కమ్యూనిస్టుల కుట్ర: కిషన్ రెడ్డి

- ●కమ్యూనిస్టులు, కాంగ్రెస్ కుట్రపూరితంగా వ్యవహరిస్తున్నాయని కిషన్ రెడ్డి ఆరోపణ
- ●వారి ధర్నాల వల్లే ఢిల్లీ మార్కెట్లు దెబ్బతిన్నాయని వ్యాఖ్య
- ●పండుగ సీజన్‌లో చిన్న వ్యాపారులను నష్టపరుస్తున్నారన్న కేంద్రమంత్రి

# ఢిల్లీలో ఒక నీతి.. తెలంగాణలో మరో నీతా? కాంగ్రెస్‌పై కిషన్ రెడ్డి ఆగ్రహం

## తెలంగాణలో మాత్రం బీజేపీ నేతల నిరసనలను ఉక్కుపాదంతో అణచివేస్తున్నారు

- ★ప్రజాస్వామ్య హక్కులపై కాంగ్రెస్ ద్వంద్వ వైఖరి అవలంబిస్తోందన్న కిషన్ రెడ్డి
- ★ఢిల్లీలో కాంగ్రెస్ నిరసనలను అడ్డుకోవడం లేదన్న కేంద్ర మంత్రి
- ★తెలంగాణలో బీజేపీ నేతలను గృహ నిర్బంధం చేస్తున్నారని ఆరోపణ
- ★రాహుల్ గాంధీ దేశవ్యాప్తంగా పర్యటిస్తూ ప్రధాని మోదీని, ఎన్నికల సంఘాన్ని, న్యాయవ్యవస్థను, సైన్యాన్ని విమర్శిస్తున్నారు



హైదరాబాద్: ప్రజాస్వామ్య హక్కుల విషయంలో కాంగ్రెస్ పార్టీ ద్వంద్వ ప్రమాణాలు పాటిస్తోందని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి విమర్శించారు. ఢిల్లీలో కాంగ్రెస్ నేతలు స్వేచ్ఛగా నిరసనలు చేస్తుంటే అనుమతిస్తున్నామని, కానీ కాంగ్రెస్ అధికారంలో ఉన్న తెలంగాణలో మాత్రం బీజేపీ నేతల నిరసనలను ఉక్కుపాదంతో అణచివేస్తున్నారని ఆయన ఆరోపించారు. తెలంగాణలో రైతుల సమస్యలు, పోలీసు నియామకాలు, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిల వంటి ప్రజా సమస్యలపై నిరసన మిగతా 2 లో

### హాస్టళ్లకు సరుకుల సరఫరా స్థానిక వెండర్లకే ఇవ్వాలి: హరీశ్ రావు



2లో

- ▶▶హాస్టళ్ల సరకుల సరఫరాకు పీఎంయూ టెండర్లు రద్దు చేయాలని హరీశ్‌రావు డిమాండ్
- ▶▶స్థానిక వెండర్ల ద్వారానే డీపీసీ పద్ధతిలో సరకులు అందించాలని సూచన
- ▶▶దీనివల్ల చిరు వ్యాపారులకు మేలు, విద్యార్థులకు నాణ్యత అందుతుందని వెల్లడి
- ▶▶కమీషన్ల కోసం బ్లాక్‌లిస్ట్ సంస్థకు టెండర్ ఇచ్చారని తీవ్ర ఆరోపణ
- ▶▶పాత విధానం తేకపోతే పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని ప్రభుత్వానికి హెచ్చరిక

# సింగరేణి కార్మికులకు దసరా ధమాకా.. ఒక్కొక్కరికి రూ.1.53 లక్షల వరకు బోనస్!

హైదరాబాద్: దసరా పండుగ వేళ సింగరేణి కార్మికులకు తీపి కబురు అందింది. సంస్థలో పనిచేస్తున్న శాశ్వత కార్మికులతో పాటు కాంట్రాక్టు వారికీ బోనస్ ప్రకటించారు. కాంట్రాక్టు కార్మికులకు ఒక్కొక్కరికి రూ.5,500 చొప్పున చెల్లించనున్నారు. మరోవైపు సంస్థ నికర లాభాల్లో 34 శాతం వాటాను పర్మినెంట్ కార్మికులకు పంపిణీ చేయనున్నారు. దీంతో సింగరేణి కార్మికుల ఇళ్లలో పండుగ సందడి నెలకొంది. సింగరేణి సాధించిన నికర లాభాల్లో 34 శాతాన్ని పర్మినెంట్ కార్మికులకు బోనస్‌గా అందించాలని యాజమాన్యం నిర్ణయించింది. ఈ మేరకు అర్హులైన ప్రతి కార్మికుడికి గరిష్ఠంగా రూ.1,53,913 వరకు అందనుంది. పండుగకు ముందే ఈ మొత్తాన్ని కార్మికుల బ్యాంకు ఖాతాల్లో జమ చేయనున్నట్లు యాజమాన్యం వెల్లడించింది. గతేడాది తరహాలోనే ఈసారి కూడా కాంట్రాక్టు కార్మికులకు బోనస్ అందించనున్నారు. ఒక్కొక్కరికి రూ.5,500 చొప్పున చెల్లించ నున్నారు. దీంతో సంస్థలో పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికుల కుటుంబాల్లోనూ దసరా ఆనందం నిండనుంది. బొగ్గు గనుల్లో రేయింబవళ్లు శ్రమిస్తూ సంస్థ అభివృద్ధికి తోడ్పడుతున్న కార్మికుల సంక్షేమానికి ప్రాధాన్యం ఇస్తున్నామని యాజమాన్యం పేర్కొంది. పండుగ వేళ బోనస్ ప్రకటనతో కార్మికుల్లో సంతోషం వ్యక్తమవుతోంది.

### మోదీపై వ్యాఖ్యలు.. పరువు నష్టం కేసులో

# రాహుల్‌కు సుప్రీంలో తాత్కాలిక ఊరట

ఢిల్లీ: ప్రధాని నరేంద్ర మోదీపై అభ్యంతరకర వ్యాఖ్యలు చేశారన్న ఆరోపణలతో కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ ఎదుర్కొంటున్న పరువునష్టం కేసులో సుప్రీంకోర్టు కీలక నిర్ణయం తీసుకుంది. ఈ కేసులో కింది కోర్టు విచారణపై మధ్యంతర స్టే విధించింది. రాహుల్ పిటిషన్‌పై స్పందన తెలియజేయాలని మహారాష్ట్ర ప్రభుత్వం, ఫిర్యాదుదారుకు నోటీసులు జారీ చేసింది. నాలుగు వారాల్లో సమాధానం ఇవ్వాలని ఆదేశించింది. రాహుల్ గాంధీ దాఖలు చేసిన పిటిషన్‌పై జస్టిస్ విక్రమ్ నాథ్, జస్టిస్ అపరేశ్ కుమార్ సింగ్‌తో కూడిన ధర్మాసనం విచారణ చేపట్టింది. పరువునష్టం కేసును కొట్టివేయాలన్న రాహుల్ అభ్యర్థనను బాంబే హైకోర్టు గతంలో తిరస్కరించింది. ఈ ఉత్తర్వులను ఆయన సుప్రీంకోర్టులో సవాలు చేశారు. రాహుల్ తరపున సీనియర్ న్యాయవాది అభిషేక్ మను సింఘ్వి వాదనలు వినిపించారు. తదుపరి విచారణ జరిగే వరకు కింది కోర్టు ప్రక్రియను నిలిపివేస్తూ ధర్మాసనం ఆదేశాలిచ్చింది. 2018 సెప్టెంబరులో రాజస్థాన్‌లో జరిగిన ఓ సభలో ప్రధాని మోదీని ఉద్దేశించి రాహుల్ అభ్యంతరకర వ్యాఖ్యలు చేశారని బీజేపీ నేత మహేశ్ ముకుంచంద్ శ్రీశ్రిమాల్ ఫిర్యాదు చేశారు. 'చోరోంకే సర్దార్', 'కమాండర్ ఇన్ థీఫ్' వంటి పదాలతో ప్రధాని ప్రతిష్ఠకు భంగం కలిగించారని ఆరోపించారు. ఈ వ్యాఖ్యలు బీజేపీ సభ్యుల గౌరవాన్ని కూడా దెబ్బతీశాయని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఫిర్యాదులోని అంశాలను పరిశీలించిన గిర్గావ్ మెజిస్ట్రేట్ కోర్టు 2019 ఆగస్టులో రాహుల్‌కు సమన్లు జారీ చేసింది. ఈ క్రిమినల్ చర్యలను రద్దు చేయాలని ఆయన బాంబే హైకోర్టును ఆశ్రయించారు. అయితే, సమన్ల జారీలో స్పష్టమైన చట్టవిరుద్ధత కనిపించడం లేదంటూ సెప్టెంబరు 8న హైకోర్టు ఆయన పిటిషన్‌ను తిరస్కరించింది. వ్యాఖ్యలు పరువునష్టం కిందకు వస్తాయా? వాటి ప్రభావం ఎంత? అన్నది విచారణలో తేలాల్సి ఉందని పేర్కొంది. సుప్రీంకోర్టును ఆశ్రయించేందుకు రాహుల్‌కు ఆరు వారాల పాటు మెజిస్ట్రేట్ ఎదుట హాజరు నుంచి మినహాయింపు కూడా ఇచ్చింది.

### ఇంద్రకీలాద్రిపై తమిళనాడు సీఎం విజయ్..

# కనకదుర్గమ్మకు ప్రత్యేక పూజలు

అమరావతి: తమిళనాడు ముఖ్యమంత్రి విజయ్ మంగళవారం విజయవాడలో పర్యటించారు. ముఖ్యమంత్రి హోదాలో తొలిసారి ఆంధ్రప్రదేశ్‌కు వచ్చిన ఆయన, ఇంద్రకీలాద్రిపై కొలువైన కనకదుర్గమ్మను దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయనకు ఆలయ అధికారులు, అర్చకులు ఘన స్వాగతం పలికారు. చెన్నై నుంచి ప్రత్యేక విమానంలో గన్నవరం విమానాశ్రయానికి చేరుకున్న ఆయన, అక్కడి నుంచి నేరుగా ఇంద్రకీలాద్రికి బయలుదేరారు. ఆలయానికి చేరుకున్న సీఎం విజయ్‌కు అర్చకులు సంప్రదాయబద్ధంగా పూర్ణకుంభ స్వాగతం పలికారు. అనంతరం ఆయన అమ్మవారిని దర్శించుకోగా, పండితులు వేదాశీర్వచనం అందించి, తీర్థప్రసాదాలను అందజేశారు. విజయ్ ముఖ్యమంత్రి హోదాలో తొలిసారి రాష్ట్రానికి రావడంతో విజయవాడ నగరంలో కోలాహలం నెలకొంది. ఆయన రాకను తెలుసుకున్న అభిమానులు, కార్యకర్తలు భారీ సంఖ్యలో గన్నవరం విమానాశ్రయానికి తరలివచ్చారు. ఆయన కాన్వాయ్‌ను అనుసరిస్తూ అభిమానులు తమ ఉత్సాహాన్ని చాటుకున్నారు.

### ఏజెన్సీలోని కానిస్టేబుల్ పోస్టుల్లో ఎస్టీలకు

# 75 శాతం రిజర్వేషన్ ఇవ్వాలి: కవిత డిమాండ్

హైదరాబాద్: తెలంగాణ ఏజెన్సీ ప్రాంతాల్లోని కానిస్టేబుల్ పోస్టుల్లో షెడ్యూల్డ్ తెగల (ఎస్టీ)కు 75 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలని తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత డిమాండ్ చేశారు. ఈ విషయంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తక్షణమే జోక్యం చేసుకోవాలని ఆమె కోరారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం 1988లో జారీ చేసిన జీవో 109, తెలంగాణ ఏర్పడిన తర్వాత 2018లో విడుదల చేసిన గెజిట్ నోటిఫికేషన్ 49 ప్రకారం ఏజెన్సీ ప్రాంతాల్లోని కానిస్టేబుల్ ఉద్యోగాల్లో ఎస్టీలకు 75 శాతం రిజర్వేషన్ కల్పించాలని కవిత పేర్కొన్నారు. అయితే, పోలీస్ రిక్రూట్‌మెంట్ బోర్డు ఇటీవల జారీ చేసిన 2026 పోలీస్ రిక్రూట్‌మెంట్ నోటిఫికేషన్‌లో ఈ నిబంధనను అమలు చేయలేదని ఆమె ఆరోపించారు. దీనివల్ల ఆదివాసీ, గిరిజన యువత కానిస్టేబుల్ ఉద్యోగాలు కోల్పోయే ప్రమాదం ఏర్పడిందన్నారు. గతంలో 2015, 2018, 2022 సంవత్సరాల్లో విడుదలైన కానిస్టేబుల్ నోటిఫికేషన్లలో ఏజెన్సీ ప్రాంతాల్లోని ఆదివాసీ, గిరిజన యువతకు 75 శాతం రిజర్వేషన్లు అమలు చేశారని గుర్తుచేశారు. కానీ, 2026 నోటిఫికేషన్‌లో ఎందుకు అమలు చేయడం లేదని ఆమె ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. ఈ నిర్ణయంతో ఆసిఫాబాద్, నాగర్‌కర్నూల్, భద్రాద్రి కొత్తగూడెం, ములుగు, జయశంకర్ భూపాలపల్లి, ఆదిలాబాద్, మంచిర్యాల, వరంగల్, ఖమ్మం, మహబూబాబాద్ జిల్లాల్లోని గిరిజన యువత 400కు పైగా కానిస్టేబుల్ పోస్టులను కోల్పోతారని ఆవేదన వ్యక్తం చేశారు. హోంమంత్రిత్వ శాఖను కూడా పర్యవేక్షిస్తున్న రేవంత్ రెడ్డి వెంటనే స్పందించి, 2026 కానిస్టేబుల్ రిక్రూట్‌మెంట్ నోటిఫికేషన్‌లో అవసరమైన సవరణలు చేసి ఆదివాసీ, గిరిజన యువతకు పూర్తి న్యాయం చేయాలని కవిత డిమాండ్ చేశారు.

## తిరుమలలో సాధారణంగా భక్తుల రద్దీ.. సర్వదర్శనానికి 8 గంటలు

తిరుపతి: కలియుగ దైవం శ్రీ వేంకటేశ్వర స్వామిని దర్శించుకునేందుకు తిరుమలకు వస్తున్న భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. టైమ్ స్లాట్ టోకెన్లు లేని భక్తులకు సర్వదర్శనానికి సుమారు 8 గంటల సమయం పడుతోందని తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) అధికారులు వెల్లడించారు. ప్రస్తుతం వైకుంఠం క్యూ కాంప్లెక్స్‌లోని 17 కంపార్ట్‌మెంట్లలో భక్తులు స్వామివారి దర్శనం కోసం వేచి ఉన్నారు. భక్తులకు ఇబ్బంది కలగకుండా టీటీడీ విస్తృత ఏర్పాట్లు చేసింది. క్యూలైన్లలో, కంపార్ట్‌మెంట్లలో వేచి ఉన్న భక్తులకు అన్నప్రసాదం, తాగునీరు, పాలను అందిస్తోంది. నిన్న మొత్తం 83,322 మంది భక్తులు శ్రీవారిని దర్శించుకున్నారు. వీరిలో 31,312 మంది తలనీలాలు సమర్పించుకున్నారు. ఒక్కరోజే స్వామివారి హుండీ ఆదాయం రూ. 2.93 కోట్లుగా నమోదైంది.

# ఓట్ల చోరీతో అధికారం నిలబెట్టుకునే పన్నాగం

హైదరాబాద్: భాజపా ఉనికి ఉన్న రాష్ట్రాల్లో సర్ ద్వారా ఓట్లను తొలగించి అధికారాన్ని కైవసం చేసుకుంది. బెంగాల్, బిహార్, హరియాణా, మహారాష్ట్రల్లో భాజపా ప్రభుత్వాలు ఏర్పాటవడమే ఇందుకు ఉదాహరణ. సర్ అమలు చేయని, భాజపా ఉనికి లేని రాష్ట్రాల్లోనే ఇతర పార్టీలు విజయం సాధించాయి. 2014లో దేశంలో 81 కోట్ల ఓట్లు ఉండేవి. 2019లో 91 కోట్లకు, 2024లో 97 కోట్లకు పెరిగాయి. మరి 2029 ఎన్నికల నాటికి ఎన్ని ఉండాలి? సర్ పేరిట ఇప్పటికే 13 కోట్లు తొలగించారు. ఇంకో ఐదారు కోట్ల ఓట్లు తొలగించాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. ప్రస్తుత దేశ జనాభా 140 కోట్లు. సరాసరిగా 70-75% లెక్కేసుకుంటే 100 కోట్లకు పైగా ఓట్లు ఉండాలి. తొలగించినవి పోను 84 కోట్లే ఉన్నాయి. 81, 91, 97 కోట్ల ఓట్లు ఉన్నప్పుడు జనాభా ఎంత? 13 కోట్ల ఓట్లు తొలగించినప్పుడు జనాభా ఎంత? జనాభా పెరిగితే ఓట్లు పెరగాలి కదా? దీనికి ప్రధాని పార్లమెంట్‌లో సమాధానం చెప్పాల్సిందే. దేశ విభజన తర్వాత కోట్ల మంది ప్రజలు పాకిస్థాన్ నుంచి భారత్‌కు తరలివచ్చారు. వారందరికీ ఓటు హక్కు కల్పించి ఎన్నికలు నిర్వహించాలని నాటి ప్రధాని నెహ్రూ ఆలోచన. 1950 నాటి ఎన్నికల జాబితాల తయారీ ప్రక్రియలో... మీ తండ్రి, తాత ఎవరు, ఎక్కడ నుంచి వచ్చారని కొన్ని కాలమ్స్ పెట్టారు. ఇందిరాగాంధీ, వాజ్‌పేయిల హయాంలో.. లిస్ట్‌లో లేని వారికి ఓటు కల్పించడానికే సర్‌ను ఉపయోగించారు. 2014లో భాజపా వచ్చాక, అధికారాన్ని పదిలం చేసుకోవాలని... ప్రాంతాలు, భాషలు, జాతులు, మతాల మధ్య చిచ్చుపెట్టారు. తమను వ్యతిరేకించే వారి ఓట్లన్నీ తొలగించాలని కుట్ర పన్నారు. "భారత ఎన్నికల సంఘం తీసుకుంటున్న నిర్ణయాల్లో తప్పులు జరుగుతున్నాయని అందులోని ఇద్దరు సభ్యులే చెబుతున్నారు. అలాంటప్పుడు సీఈసీ జ్ఞానేశ్‌కుమార్‌పై చర్యలు తీసుకోవడానికి ప్రధాని నరేంద్రమోదీ, హోంమంత్రి అమిత్‌షాలకు ఉన్న అభ్యంతరాలేంటి, ఆయన్ని ఎందుకు కాపాడుతున్నారు, మీతో కలిసి ఓట్లు తొలగించడమే ఇందుకు కారణం కాదా" అంటూ సీఎం రేవంత్‌రెడ్డి ప్రశ్నించారు. ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే పిలుపుతో లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీ ఆధ్వర్యంలో.. దిల్లీలో సోమవారం ఇండియా కూటమి చేపట్టిన 'మార్చ్ ఫర్ డెమోక్రసీ' ర్యాలీలో పాల్గొనేందుకు సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్ సహా మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, డీసీసీ అధ్యక్షులు సోమవారం దిల్లీకి తరలివచ్చారు. ర్యాలీకి ముందు.. పోరాట పంథాపై తెలంగాణభవన్‌లోని అంబేడ్కర్ ఆడిటోరియంలో శ్రేణులకు రేవంత్‌రెడ్డి దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... "ఆనాడు భగత్‌సింగ్ నేతృత్వంలో సైమన్ గో బ్యాక్ నినాదమే దేశ స్వాతంత్ర్య పోరాటానికి దారులు వేసింది. నేడు రాహుల్‌గాంధీ నేతృత్వంలో జ్ఞానేశ్ గో బ్యాక్ నినాదమే భాజపా నుంచి దేశానికి విముక్తి కల్పిస్తుంది. దీన్నే మరో స్వాతంత్ర్య పోరాటస్థాయిలో ఉద్యమాన్ని కొనసాగిద్దాం. ఎన్నికల ప్రధాన అధికారిని.. ప్రధాని, ప్రధాన ప్రతిపక్షనేత, సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి కమిటీగా ఏర్పడి ఎన్నుకునేవారు. 2023లో మోదీ ప్రభుత్వం చట్టాన్ని సవరించి ఈ ఎన్నిక కమిటీలో సీజేఐని తొలగించి, కేంద్ర హోంశాఖ మంత్రిని తీసుకొచ్చింది. జ్ఞానేశ్‌కుమార్ వద్దని రాహుల్‌గాంధీ పూర్తిగా వ్యతిరేకించినా.. ప్రతిపక్షం గొంతు నొక్కుతూ ప్రధాని, హోంమంత్రి ఆయన్నే నియమించారు. వారిచ్చిన టాస్క్ ప్రకారమే.. బిహార్, బెంగాల్, హరియాణా, మహారాష్ట్ర, ఉత్తర్‌ప్రదేశ్‌లలో ఆ పార్టీని వ్యతిరేకిస్తున్న దళితులు, ఆదివాసీలు, గిరిజనులు, మైనారిటీలు, యువత ఓట్లను జ్ఞానేశ్‌కుమార్ తీసేయించారు. సోషల్ మీడియాను ఏఐతో అనుసంధానించి.. భాజపాకు, మోదీకి వ్యతిరేకంగా పోస్టులు పెడుతున్న వారి ఓట్లనూ తొలగిస్తున్నారు. ఈ కుట్రను మొదటిసారిగా బయటపెట్టింది రాహుల్‌గాంధీ. ఆయన నేతృత్వంలో భాజపా దురాగతాలను సమర్థంగా తిప్పికొడతాం" అని వివరించారు. ప్రజల మధ్య విభజన తేవాలనే కుట్ర.

# జంతర్‌మంతర్ బంద్.. రామ్‌లీలాలో గళం విప్పాలంటే రోజుకు రూ.1.21 లక్షలు!

ఢిల్లీ: ఢిల్లీలో నిరసన ప్రదర్శనలకు వేదిక మారింది. గతంలో జంతర్ మంతర్ వద్ద ఆందోళనలు నిర్వహించే వారు ఇప్పుడు ప్రత్యామ్నాయ ప్రదేశాలను ఆశ్రయించాల్సి వస్తోంది. అయితే కొత్తగా కేటాయించిన రామ్‌లీలా మైదాన్‌లో నిరసన చేపట్టాలంటే భారీ మొత్తంలో ఖర్చు చేయాల్సి వస్తోంది. రోజుకు రూ.50 వేల అద్దెతో పాటు ఇతర చెల్లింపులు కలిపి తొలిరోజే రూ.1.21 లక్షల వరకు వెచ్చించాల్సి వస్తోంది. దీనికి తోడు ఈ ఏడాదిలో డిసెంబరు 29, 30, 31 తేదీలు మినహా మైదాన్ అందుబాటులో లేదని అధికారులు చెబుతున్నారు.

రోజుకు రూ.50 వేల అద్దె

ఢిల్లీలోని 12 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న రామ్‌లీలా మైదాన్‌లో సుమారు 50 వేల మంది పాల్గొనేలా కార్యక్రమాలు నిర్వహించవచ్చు. ఈ మైదాన్ బుకింగ్ కోసం రోజుకు రూ.50 వేలు చెల్లించాలి. అదనంగా రూ.55 వేల సెక్యూరిటీ డిపాజిట్ ఇవ్వాలి. ఇది తిరిగి చెల్లిస్తారు. పన్నులతో కలిపి ఒక్కరోజు బుకింగ్‌కు తొలుత రూ.1.21 లక్షల వరకు ఖర్చవుతుందని అధికారులు వెల్లడించారు. మైదాన్‌లో చిన్న ప్రాంతాన్ని ఉచిత నిరసనలకు కేటాయించినా.. అక్కడ కేవలం 150 మందికే అవకాశం ఉంది.

పోలీసుల అనుమతి తప్పనిసరి

ఢిల్లీ మున్సిపల్ కార్పొరేషన్ ఉద్యానవన విభాగం ద్వారా మైదాన్‌ను బుక్ చేసుకోవాలి. దరఖాస్తుకు ఢిల్లీ పోలీసుల నిరభ్యంతర పత్రం తప్పనిసరి. అక్టోబరు 11న జారీ చేసిన ఉత్తర్వుల ప్రకారం జంతర్ మంతర్‌ను నిరసన వేదికల జాబితా నుంచి తొలగించారు. దాని స్థానంలో రామ్‌లీలా మైదాన్, బురారీ మైదాన్, తూర్పు ఢిల్లీలోని సీబీడీ మైదాన్‌లను కేటాయించారు. ఈ మూడు ప్రాంతాల్లో నిరసనల నిర్వహణకు సంబంధించిన సమగ్ర మార్గదర్శకాలను ప్రత్యేకంగా విడుదల చేస్తామని పోలీసులు తెలిపారు.

## ట్రాఫిక్ సమస్యలూ తప్పవు

రామ్‌లీలా మైదాన్ రద్దీగా ఉండే వాణిజ్య ప్రాంతంలో ఉంది. సమీపంలో మూడు ఆసుపత్రులు, మున్సిపల్ సంస్థల ప్రధాన కార్యాలయాలు ఉన్నాయి. భారీ సభలు జరిగినప్పుడు చుట్టుపక్కల రహదారులపై ట్రాఫిక్ సమస్యలు తలెత్తుతాయని అధికారులు చెబుతున్నారు. అసఫ్ అలీ రోడ్డులో వాహనాల రాకపోకలను వన్‌సైడ్‌గా మార్చడంతో పాటు ఇతర మార్గాల్లోనూ మళ్లింపులు చేపట్టాల్సి వస్తుంది. 2014లో ఇక్కడ జరిగిన బీజేపీ సభ కారణంగా దాదాపు నాలుగు కిలోమీటర్ల దూరంలోని ఐటీఓ వరకు ట్రాఫిక్ స్తంభించిందని ఓ అధికారి గుర్తుచేశారు.

## చరిత్రకు సాక్షిగా మైదాన్

ఒకప్పుడు చెరువుగా ఉన్న ఈ ప్రాంతాన్ని 1930 నాటికి చదును చేశారు. 1932 నుంచి ఇక్కడ రామ్‌లీలా వేడుకలు నిర్వహిస్తున్నారు. స్వాతంత్ర్యం తర్వాత శరణార్థులకు ఉపాధి కల్పించేలా 1951లో ఈ ప్రాంతాన్ని అభివృద్ధి చేశారు. అనంతరం దేశ రాజకీయాల్లోనూ ఈ మైదాన్ కీలక వేదికగా నిలిచింది. 1975లో అత్యవసర పరిస్థితి ప్రకటించిన రోజున జయప్రకాశ్ నారాయణ్, అటల్ బిహారీ వాజ్‌పేయి ఇక్కడ సభలో ప్రసంగించారు. 2013లో అరవింద్ కేజ్రీవాల్ ఢిల్లీ ముఖ్యమంత్రిగా ఇక్కడే ప్రమాణ స్వీకారం చేశారు.

# నగరపాలక సంస్థలు, పురపాలక సంఘాలకు రిజర్వేషన్లు ఖరారు

అమరావతి : నగరపాలక సంస్థలు, పురపాలక సంఘాల ఎన్నికలకు రిజర్వేషన్లు ఖరారయ్యాయి. 17 నగరపాలక సంస్థల్లో మేయర్ పదవులను ఎస్టీ-1, ఎస్సీ-2, బీసీ-5, మహిళలు (జనరల్)-5, జనరల్ (అన్‌రిజర్వ్‌డ్)కు 4 కేటాయించారు. 106 పురపాలక సంఘాల్లో ఎస్టీ-3, ఎస్సీ-14, బీసీ-36, మహిళలు(జనరల్)-27, అన్ రిజర్వ్‌డ్‌కు 26 ఛైర్‌పర్సన్ పదవులు కేటాయిస్తూ సోమవారం పురపాలకశాఖ గెజిట్ విడుదల చేసింది. మొత్తం 123 నగరపాలక సంస్థలు, పురపాలక సంఘాల్లో.. బీసీలకు 41, ఎస్సీలకు 16, ఎస్టీలకు 4 స్థానాలు కేటాయించారు. 50 శాతం స్థానాల్లో మహిళలే గద్దెనెక్కనున్నారు. నగరపాలక సంస్థలు, పురపాలక సంఘాల్లో వార్డుల వారీ రిజర్వేషన్లు కూడా విడుదల చేశారు. కర్నూలు, రాజమహేంద్రవరం నగరపాలక సంస్థలను ఎస్సీలకు, మంగళగిరి-తాడేపల్లి నగరపాలక సంస్థ ఎస్టీకి దక్కాయి. మహా విశాఖపట్నం నగరపాలక సంస్థతో పాటు గుంటూరు, కడప, శ్రీకాకుళం, విజయనగరం కార్పొరేషన్లలో మహిళలే మేయర్లు కానున్నారు.

శ్రీకాకుళం, అనకాపల్లి జిల్లాల్లో మహిళలదే పైచేయి..

శ్రీకాకుళం జిల్లాలోని మూడు మున్సిపాలిటీలూ మహిళలకే దక్కాయి. పార్వతీపురం మన్యం జిల్లాలోని మూడు పురపాలక సంఘాల్లో రెండింట్లో బీసీ మహిళలకే అవకాశం లభించింది. అనకాపల్లి జిల్లాలోని నర్సీపట్నం, యలమంచిలి మున్సిపాలిటీలు రెండూ మహిళలకే దక్కాయి. బాపట్ల జిల్లాలోని మూడింటిలో రెండు మహిళలకే కేటాయించారు. పశ్చిమ గోదావరి జిల్లాలోని 6 పురపాలక సంఘాల్లో నాలుగు చోట్ల మహిళలు ఛైర్‌పర్సన్లుగా ఎన్నికయ్యే అవకాశం లభించింది. వైఎస్సార్ కడప జిల్లాలో 8 పురపాలక సంఘాలు ఉండగా.. ఐదు మహిళలకు దక్కాయి. కర్నూలు జిల్లాలోని మూడు పురపాలక సంఘాల్లో రెండుచోట్ల మహిళలకు అవకాశం లభించింది. తూర్పుగోదావరి జిల్లాలోని మూడింటిలో రెండు మహిళలకే దక్కాయి. విజయనగరం జిల్లాలోని మూడు పురపాలక సంఘాల్లో మూడూ మహిళలకు లభించాయి.

కాకినాడ నగరపాలక సంస్థలో 2005 ఎన్నికల్లో బీసీ మహిళ, 2017 ఎన్నికల్లో జనరల్ మహిళలు మేయర్లుగా ఎన్నికయ్యారు. ఈసారి అక్కడి నుంచి బీసీ మహిళకు మేయర్‌గా ఎన్నికయ్యే అవకాశం లభించింది. కాకినాడ జిల్లాలోని మున్సిపాలిటీల్లో మూడు ఎస్సీలకు దక్కాయి. బాపట్ల జిల్లాలోని మూడింట రెండు ఎస్సీలకు లభించాయి. ప్రకాశం జిల్లాలోని నాలుగు పురపాలక సంఘాలూ జనరల్ అయ్యాయి. పల్నాడు జిల్లాలోని ఎనిమిదింటిలో నాలుగు జనరల్‌గా నిర్ణయించారు.

జిల్లాల వారీగా పురపాలక సంఘాల రిజర్వేషన్ల వివరాలు

మొత్తం 106: ఎస్టీ జనరల్ 2, ఎస్టీ మహిళ 1, ఎస్సీ జనరల్ 7, ఎస్సీ మహిళ 7, బీసీ జనరల్ 18, బీసీ మహిళ 18, జనరల్ మహిళ 27, జనరల్ (అన్ రిజర్వ్‌డ్) 26.

శ్రీకాకుళం: ఇచ్ఛాపురం (బీసీ మహిళ), పలాస-కాశీబుగ్గ (మహిళ జనరల్), ఆమదాలవలస (మహిళ జనరల్).

విజయనగరం: రాజాం (బీసీ మహిళ), నెల్లిమర్ల (బీసీ జనరల్), బొబ్బిలి (మహిళ జనరల్),

పార్వతీపురం మన్యం: పార్వతీపురం (మహిళ జనరల్), సాలూరు (బీసీ మహిళ), పాలకొండ (బీసీ మహిళ).

అనకాపల్లి: నర్సీపట్నం (బీసీ మహిళ), యలమంచిలి (మహిళ జనరల్).

తూర్పు గోదావరి: నిడదవోలు (ఎస్సీ మహిళ), కొవ్వూరు (మహిళ జనరల్), మండపేట (జనరల్).

కాకినాడ: ఏలేశ్వరం (ఎస్సీ మహిళ), సామర్లకోట (ఎస్సీ జనరల్), పిఠాపురం (ఎస్సీ జనరల్), తుని (బీసీ మహిళ), గొల్లప్రోలు (జనరల్), పెద్దాపురం (జనరల్).

బీఆర్ అంబేద్కర్ కోనసీమ: ముమ్మిడివరం (బీసీ మహిళ), రామచంద్రపురం (బీసీ జనరల్), అమలాపురం (జనరల్).

ఏలూరు: చింతలపూడి (ఎస్సీ మహిళ), నూజివీడు (ఎస్సీ జనరల్), జంగారెడ్డిగూడెం (బీసీ మహిళ).

పశ్చిమ గోదావరి: పాలకొల్లు (బీసీ మహిళ), నరసాపురం (మహిళ జనరల్), ఆకివీడు (మహిళ జనరల్), భీమవరం (మహిళ జనరల్), తణుకు (జనరల్), తాడేపల్లిగూడెం (జనరల్).

కృష్ణా: ఉయ్యూరు (ఎస్సీ జనరల్), గుడివాడ (బీసీ మహిళ), తాడిగడప (బీసీ జనరల్), పెడన (మహిళ జనరల్).

ఎన్టీఆర్: కొండపల్లి (ఎస్సీ మహిళ), తిరువూరు (బీసీ జనరల్), జగ్గయ్యపేట (మహిళ జనరల్), నందిగామ (జనరల్).

గుంటూరు: పొన్నూరు (మహిళ జనరల్), తెనాలి (జనరల్).

పల్నాడు: పిడుగురాళ్ల (బీసీ జనరల్), సత్తెనపల్లి (బీసీ జనరల్), చిలకలూరిపేట (మహిళ జనరల్), మాచర్ల (మహిళ జనరల్), గురజాల (జనరల్), దాచేపల్లి (జనరల్), వినుకొండ (జనరల్), నరసరావుపేట (జనరల్).

బాపట్ల: చీరాల (ఎస్సీ మహిళ), బాపట్ల (ఎస్సీ జనరల్), రేపల్లె (మహిళ జనరల్).

ప్రకాశం: కందుకూరు (జనరల్), చీమకుర్తి (జనరల్), అద్దంకి (జనరల్), దర్శి (జనరల్).

మార్కాపురం: పొదిలి (ఎస్సీ జనరల్), కనిగిరి (మహిళ జనరల్), గిద్దలూరు (జనరల్), మార్కాపురం (జనరల్).

నెల్లూరు: గూడూరు (ఎస్టీ మహిళ), అల్లూరు (ఎస్టీ జనరల్), బుచ్చిరెడ్డిపాలెం (మహిళ జనరల్), ఆత్మకూరు (మహిళ జనరల్), కావలి (జనరల్).

తిరుపతి: సూళ్లూరుపేట (ఎస్సీ మహిళ), పుత్తూరు (బీసీ జనరల్), శ్రీకాళహస్తి (బీసీ జనరల్), వెంకటగిరి (మహిళ జనరల్), నాయుడుపేట (మహిళ జనరల్).

చిత్తూరు: కుప్పం (ఎస్సీ జనరల్), పుంగనూరు (బీసీ మహిళ), పలమనేరు (మహిళ జనరల్), నగరి (జనరల్).

అన్నమయ్య: మదనపల్లె (బీసీ జనరల్), రాయచోటి (బీసీ జనరల్), బి.కొత్తకోట (బీసీ జనరల్).

వైఎస్సార్ కడప: యర్రగుంట్ల (బీసీ మహిళ), రాజంపేట (బీసీ మహిళ), కమలాపురం (మహిళ జనరల్), జమ్మలమడుగు (మహిళ జనరల్), పులివెందుల (మహిళ జనరల్), ప్రొద్దుటూరు (జనరల్), బద్వేలు (జనరల్), మైదుకూరు (జనరల్).

అనంతపురం: గుత్తి (ఎస్సీ మహిళ), గుంతకల్లు (బీసీ మహిళ), తాడిపత్రి (బీసీ జనరల్), కళ్యాణదుర్గం (మహిళ జనరల్), రాయదుర్గం (జనరల్)

శ్రీసత్యసాయి: కదిరి (బీసీ మహిళ), హిందూపురం (బీసీ జనరల్), మడకశిర (బీసీ జనరల్), పుట్టపర్తి (బీసీ జనరల్), పెనుకొండ (బీసీ జనరల్), ధర్మవరం (జనరల్).

నంద్యాల: ఆత్మకూరు (ఎస్టీ జనరల్), ఆళ్లగడ్డ (బీసీ మహిళ), నందికొట్కూరు (బీసీ మహిళ), బేతంచెర్ల (బీసీ జనరల్), నంద్యాల (బీసీ జనరల్), డోన్ (మహిళ జనరల్).

కర్నూలు: గూడూరు (బీసీ మహిళ), ఆదోని (మహిళ జనరల్), ఎమ్మిగనూరు (జనరల్).

ఈ జిల్లాల్లో బీసీలదే ఆధిపత్యం

అన్నమయ్య జిల్లాలో మదనపల్లె, రాయచోటి, బి.కొత్తకోట పురపాలక సంఘాలు ఉండగా.. అన్ని చోట్లా బీసీలకు అవకాశం దక్కింది. పార్వతీపురం మన్యం జిల్లాలో మూడు పురపాలక సంఘాల్లోనూ మహిళలే ఛైర్‌పర్సన్లు కానున్నారు. శ్రీసత్యసాయి జిల్లాలోని ఆరు పురపాలక సంఘాల్లో 5 చోట్ల బీసీలకు పీఠం ఖరారైంది. ధర్మవరం అన్ రిజర్వ్‌డ్ అయింది. నంద్యాల జిల్లాలోని ఆరు పురపాలక సంఘాల్లో నాలుగు చోట్ల బీసీలు ఛైర్‌పర్సన్లుగా ఎన్నికయ్యే అవకాశం దక్కింది. బీఆర్ అంబేడ్కర్ జిల్లా కోనసీమలోని మూడు పురపాలక సంఘాల్లో రెండు చోట్ల బీసీలకు అవకాశం లభించింది.

## 17 నగరపాలక సంస్థల్లో మేయర్ రిజర్వేషన్లు

శ్రీకాకుళం: మహిళ (జనరల్); విజయనగరం: మహిళ (జనరల్); విశాఖపట్నం: మహిళ (జనరల్); రాజమహేంద్రవరం: ఎస్సీ (జనరల్); కాకినాడ: బీసీ మహిళ; ఏలూరు: బీసీ (జనరల్); మచిలీపట్నం: బీసీ మహిళ; మంగళగిరి-తాడేపల్లి: ఎస్టీ (జనరల్); గుంటూరు: మహిళ (జనరల్); విజయవాడ: జనరల్; ఒంగోలు: జనరల్; నెల్లూరు: జనరల్; తిరుపతి: జనరల్; చిత్తూరు: బీసీ (జనరల్); అనంతపురం: బీసీ (జనరల్); కడప: మహిళ (జనరల్); కర్నూలు: ఎస్సీ మహిళ

మొత్తం 17: ఎస్టీ 1, ఎస్సీ జనరల్ 1, ఎస్సీ మహిళ 1, బీసీ మహిళ 2, బీసీ జనరల్ 3, మహిళ జనరల్ 5, జనరల్ (అన్ రిజర్వ్‌డ్) 4.

# హాస్టళ్లకు సరుకుల సరఫరా స్థానిక వెండర్లకే ఇవ్వాలి: హరీశ్ రావు

హైదరాబాద్: రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలలు, వసతి గృహాలకు సరకుల సరఫరా చేసే విధానంపై మాజీ మంత్రి, బీఆర్ఎస్ నేత హరీశ్‌రావు ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. సరకుల సరఫరా కోసం నూతనంగా ప్రవేశపెట్టిన పీఎంయూ (ప్రాజెక్ట్ మేనేజ్‌మెంట్ యూనిట్) టెండర్లను తక్షణమే రద్దు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ విధానం స్థానిక చిరు వ్యాపారుల ప్రయోజనాలను తీవ్రంగా దెబ్బతీస్తుందని ఆరోపించారు. ఈ సందర్భంగా హరీశ్‌రావు మాట్లాడుతూ, గతంలో మాదిరిగానే పాఠశాలను ఒక యూనిట్‌గా పరిగణించి, డీపీసీ (జిల్లా కొనుగోలు కమిటీ) ద్వారా స్థానిక వ్యాపారులకే సరఫరా బాధ్యతలు అప్పగించాలని స్పష్టం చేశారు. అప్పుడే చిరు వ్యాపారులకు భరోసా ఉంటుందని, విద్యార్థులకు నాణ్యమైన ఆహార పదార్థాలు అందుతాయని పేర్కొన్నారు. స్థానిక వ్యాపారులకు అవకాశం ఇవ్వకుండా ఒకే సంస్థకు టెండర్లు అప్పగించడం వెనుక భారీగా కమీషన్ల ప్రయోజనాలు ఉన్నాయని ఆయన విమర్శించారు. "కేవలం కమీషన్ల కోసం కక్కుర్తిపడి, ఇప్పటికే బ్లాక్‌లిస్ట్‌లో ఉన్న ఒక సంస్థకు టెండర్లు కట్టబెట్టడం అత్యంత దుర్మార్గమైన చర్య" అని హరీశ్‌రావు మండిపడ్డారు. ప్రభుత్వం తన నిర్ణయాన్ని పునఃసమీక్షించుకుని పాత విధానాన్ని పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. ఒకవేళ తమ డిమాండ్లను ప్రభుత్వం పట్టించుకోని పక్షంలో, రాష్ట్రవ్యాప్తంగా పెద్ద ఎత్తున పోరాటం నిర్వహిస్తామని ఆయన ప్రభుత్వాన్ని హెచ్చరించారు.

## విదేశీ శక్తులతో కలిసి కమ్యూనిస్టుల కుట్ర: కిషన్ రెడ్డి

హైదరాబాద్: దేశంలో అరాచకం సృష్టించేందుకు కమ్యూనిస్టులు, కాంగ్రెస్ పార్టీలు విదేశీ శక్తులతో కలిసి కుట్ర పన్నుతున్నాయని కేంద్రమంత్రి కిషన్ రెడ్డి సంచలన ఆరోపణలు చేశారు. ఢిల్లీలో నిరసనల పేరుతో ఈ పార్టీలు ఉద్దేశపూర్వకంగా దేశ ఆర్థిక వ్యవస్థను, శాంతిభద్రతలను దెబ్బతీసే ప్రయత్నం చేస్తున్నాయని ఆయన తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. ఢిల్లీలో మీడియాతో మాట్లాడిన కిషన్ రెడ్డి... కమ్యూనిస్టుల పాత్రపై ప్రత్యేకంగా ఆగ్రహం వ్యక్తం చేశారు. "కాంగ్రెస్, కమ్యూనిస్టులు చేస్తున్న ధర్నాల వల్ల ఢిల్లీ మార్కెట్ పూర్తిగా దెబ్బతింది. దసరా, దీపావళి వంటి పండుగ సీజన్‌లో చిన్న దుకాణదారులు సరుకులు తెచ్చుకోలేని దుస్థితిని కల్పించారు. కుట్రపూరితంగా ఢిల్లీ ప్రజల జీవనాన్ని అస్తవ్యస్తం చేస్తూ వ్యాపారుల పొట్ట కొడుతున్నారు" అని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. రాహుల్ గాంధీ తన స్థాయిని మరిచి చిల్లర రాజకీయాలు చేస్తున్నారని మండిపడ్డారు. రాహుల్ గాంధీ, కాంగ్రెస్, కమ్యూనిస్టులు ప్రజాస్వామ్య హక్కులను దుర్వినియోగం చేస్తూ దేశ ప్రతిష్టను మంటగలుపుతున్నారని విమర్శించారు. ప్రధాని మోదీ, అమిత్ షా, అజిత్ దోవల్‌ను లక్ష్యంగా చేసుకుని బాధ్యతారహితంగా మాట్లాడుతున్నారని మండిపడ్డారు. తమకు అనుకూలంగా తీర్పులు రాలేదని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిని కూడా గద్దె దిగమనడం వారి దిగజారుడు రాజకీయాలకు నిదర్శనమని కిషన్ రెడ్డి దుయ్యబట్టారు. ప్రభుత్వంపై విమర్శలు చేయడంలో తప్పులేదని, కానీ రాజ్యాంగబద్ధ సంస్థలను నిర్వీర్యం చేసేలా వ్యవహరించడం దారుణమని ఆయన పేర్కొన్నారు.

### నామినేటెడ్ పదవుల్లో ఉన్న వారికి గుడ్ న్యూస్..

# పదవీకాలం పెంచిన ఏపీ ప్రభుత్వం

అమరావతి: ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. రాష్ట్రంలోని పలు ప్రభుత్వ కార్పొరేషన్లు, బోర్డులు, ఇతర సంస్థల్లో నామినేటెడ్ పోస్టుల పదవీకాలాన్ని మరో రెండు నెలల పాటు పొడిగించింది. ఈ మేరకు సంబంధిత శాఖల అధికారులు ఈరోజు ఉత్తర్వులు జారీ చేసింది. ఈ నిర్ణయంతో ఛైర్మన్లు, డైరెక్టర్లు, ఇతర నామినేటెడ్ పదవుల్లో ఉన్నవారు తమ విధుల్లో కొనసాగనున్నారు. ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలు, పాలనాపరమైన అభివృద్ధి పనుల అమలుకు ఎలాంటి ఆటంకం కలగకుండా, వాటిని మరింత వేగవంతం చేసే లక్ష్యంతోనే ఈ నిర్ణయం తీసుకున్నట్లు ప్రభుత్వం స్పష్టం చేసింది. ప్రస్తుతం పదవుల్లో ఉన్న నేతల పనితీరు, శాఖల మధ్య సమన్వయం ఆధారంగా ఈ పొడిగింపు వర్తిస్తుందని తెలుస్తోంది. ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయంపై పలువురు కార్పొరేషన్ల ఛైర్మన్లు, డైరెక్టర్లు హర్షం వ్యక్తం చేశారు. తమపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ, ఈ పొడిగింపు కాలంలో ప్రజాసేవలో మరింత చురుగ్గా పనిచేస్తామని వారు తెలిపారు. ఈ పొడిగింపుతో అభివృద్ధి పనుల కొనసాగింపునకు మార్గం సుగమం అయిందని పేర్కొన్నారు.

# ఎల్బీనగర్-హయత్‌నగర్ డబుల్ డెక్కర్ కారిడార్‌కు కేంద్రం గ్రీన్ సిగ్నల్

హైదరాబాద్ : తెలంగాణలోని పలు కీలక మౌలిక సదుపాయాల ప్రాజెక్టులకు కేంద్ర ప్రభుత్వం ఆమోదం తెలిపింది. రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి మంగళవారం ఢిల్లీలో కేంద్ర రోడ్డు రవాణా, రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీతో సమావేశమయ్యారు. ఈ భేటీలో రాష్ట్రానికి సంబంధించిన పలు కీలక ప్రాజెక్టులపై చర్చించగా, కేంద్ర మంత్రి సానుకూలంగా స్పందించారు. హైదరాబాద్‌లోని అత్యంత రద్దీ మార్గాల్లో ఒకటైన ఎల్బీనగర్ నుంచి హయత్‌నగర్ వరకు డబుల్ డెక్కర్ ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణానికి గడ్కరీ ఆమోదం తెలిపారు. ఈ ప్రాజెక్టు పూర్తయితే విజయవాడ జాతీయ రహదారిపై ట్రాఫిక్ కష్టాలు గణనీయంగా తీరనున్నాయి. వీటితో పాటు, కృష్ణా నదిపై నిర్మించతలపెట్టిన ఐకానిక్ కేబుల్ బ్రిడ్జ్‌ల శంకుస్థాపన ప్రతిపాదనకు కూడా ఆయన సానుకూలత వ్యక్తం చేశారు. తెలుగు రాష్ట్రాలను కలిపే హైదరాబాద్-అమరావతి గ్రీన్‌ఫీల్డ్ హైవే నిర్మాణంపైనా ఈ సమావేశంలో చర్చ జరిగింది. ఈ ప్రతిపాదనపై కూడా గడ్కరీ సానుకూలంగా స్పందించినట్లు మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి వెల్లడించారు. ఇదే క్రమంలో, నవంబర్ 19 నుంచి 22 వరకు హైదరాబాద్‌లో నిర్వహించనున్న 'ఇండియన్ రోడ్' కాంగ్రెస్ సదస్సుకు ముఖ్య అతిథిగా హాజరుకావాలని గడ్కరీని ఆయన ఆహ్వానించారు.

# మరోసారి చెపుతున్నా.. అధికారం

## జెన్-జీది, నాది బాల్ థాకరే పాత్ర: విజయసాయిరెడ్డి

అమరావతి: రాజ్యసభ మాజీ సభ్యుడు విజయసాయిరెడ్డి తన రాజకీయ భవిష్యత్‌పై మరో ప్రకటన చేశారు. ఆయన త్వరలోనే పార్టీ పెట్టబోతుండడం తెలిసిందే. అందుకు తగిన సన్నాహాలు జోరుగా సాగుతున్నాయని వెల్లడించారు. రాజకీయాల్లో తనది బాల్ థాకరే (శివసేన వ్యవస్థాపకుడు) వంటి పాత్రేనని, అధికారం యువతరానిదే (జెన్-జీ) అని తాజాగా ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. ఈ మేరకు ఆయన సోషల్ మీడియాలో ఒక పోస్ట్ పెట్టారు. "పార్టీ పేరు, జెండా, ఎజెండా ఈ పవిత్ర దసరా పర్వదినాల్లో సిద్ధం అవుతున్నాయి" అని వెల్లడించారు. తాను పార్టీ పెట్టవద్దని కోరుకునే వారు చేస్తున్న చౌకబారు ప్రచారాలకు విలువివ్వాల్సిన అవసరం లేదని కొట్టిపారేశారు. రాష్ట్రంలోని రెండు కుటుంబ పార్టీలపై తిరుగుబాటుగానే తన పార్టీ ఆవిర్భవిస్తుందని విజయసాయిరెడ్డి స్పష్టం చేశారు. ప్రతి నియోజకవర్గంలో మెరికల్లాంటి కొత్త నాయకత్వాన్ని తయారు చేయడమే తన లక్ష్యమని పేర్కొన్నారు. "మరోసారి చెపుతున్నా... అధికారం జెన్-జీది, నాది బాల్ థాకరే పాత్ర" అని తన పోస్టులో వివరించారు. గత సార్వత్రిక ఎన్నికల అనంతరం చోటుచేసుకున్న పరిణామాల నేపథ్యంలో విజయసాయిరెడ్డి వైసీపీకి దూరమైన విషయం తెలిసిందే. ఆ తర్వాత పార్టీకి రాజీనామా చేసి, కొంతకాలం వ్యవసాయంపై దృష్టి సారించారు. ఆయన వేరే పార్టీలో చేరతారంటూ ప్రచారం జరిగినా, వాటన్నింటినీ తోసిపుచ్చుతూ సొంతంగా పార్టీ పెట్టడానికే మొగ్గు చూపారు. తాజా పోస్టుతో విజయసాయిరెడ్డి ఏపీ రాజకీయాల్లో తన తదుపరి అడుగులను ఖరారు చేసినట్టయింది.

### ఢిల్లీలో ఒక నీతి.. తెలంగాణలో మరో నీతా?

# కాంగ్రెస్‌పై కిషన్ రెడ్డి ఆగ్రహం

హైదరాబాద్: ప్రజాస్వామ్య హక్కుల విషయంలో కాంగ్రెస్ పార్టీ ద్వంద్వ ప్రమాణాలు పాటిస్తోందని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి విమర్శించారు. ఢిల్లీలో కాంగ్రెస్ నేతలు స్వేచ్ఛగా నిరసనలు చేస్తుంటే అనుమతిస్తున్నామని, కానీ కాంగ్రెస్ అధికారంలో ఉన్న తెలంగాణలో మాత్రం బీజేపీ నేతల నిరసనలను ఉక్కుపాదంతో అణచివేస్తున్నారని ఆయన ఆరోపించారు. తెలంగాణలో రైతుల సమస్యలు, పోలీసు నియామకాలు, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిల వంటి ప్రజా సమస్యలపై నిరసన తెలిపేందుకు ప్రయత్నిస్తే, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావుతో సహా పలువురు నేతలను గృహ నిర్బంధం చేస్తున్నారని మండిపడ్డారు. రాహుల్ గాంధీ దేశవ్యాప్తంగా పర్యటిస్తూ ప్రధాని మోదీని, ఎన్నికల సంఘాన్ని, న్యాయవ్యవస్థను, సైన్యాన్ని విమర్శిస్తున్నా ఆయన హక్కులను కేంద్ర ప్రభుత్వం ఎన్నడూ అడ్డుకోలేదని స్పష్టం చేశారు. ఢిల్లీలో కాంగ్రెస్ నేతలకు ఉన్న ప్రజాస్వామ్య హక్కులు... తెలంగాణలోని బీజేపీ నేతలకు ఎందుకు ఉండవు? అని ఆయన సూటిగా ప్రశ్నించారు. చేతిలో రాజ్యాంగం పట్టుకుంటే సరిపోదని, అధికారంలో ఉన్నప్పుడు దానిని ఆచరించాలని హితవు పలికారు. 1975లో ఎమర్జెన్సీ విధించి ప్రతిపక్ష నేతలను జైళ్లలో పెట్టిన చరిత్ర కాంగ్రెస్‌దని ఆయన గుర్తుచేశారు.

RNI : APTEL/25/A0108
www.mahinewsindia.com
మహి న్యూస్
తెలుగు దినపత్రిక
epaper: https://epaper.mahinewsindia.com



# వేంపల్లి రైతు బజార్ లో ఉల్లి, సన్న బియ్యం ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేయాలి....

\- డాక్టర్ నర్రెడ్డి తులసి రెడ్డి.



వేంపల్లి మహి న్యూస్ అక్టోబర్ 13.: వేంపల్లి రైతు బజార్ లో ఉల్లి,సన్న బియ్యం ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేయాలని రాజ్యసభ మాజీ సభ్యులు,కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర మీడియా చైర్మన్ డాక్టర్ నర్రెడ్డి తులసిరెడ్డి రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. మంగళవారం వేంపల్లి లో మీడియా సమావేశంలో మాట్లాడుతూ బహిరంగ మార్కెట్లో సన్నబియ్యం, ఉల్లిపాయల ధరలు గత కొంతకాలంగా గణనీయంగా పెరిగాయని, సామాన్యుల వంటింటి బడ్జెట్ పై తీవ్ర ప్రభావం చూపుతున్నాయని అన్నారు. సన్న బియ్యం ధర దాదాపు 25 శాతం పెరిగింది.బహిరంగ మార్కెట్లో కిలో సన్న బియ్యం ధర దాదాపు 85 రూపాయలు ఉంది. పెరుగుతున్న ధరల నుండి సామాన్యులకు ఉపశమనం కలిగించేటందుకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం రైతు బజార్ల ద్వారా సబ్సిడీపై సన్నబియాన్ని అందిస్తుండడం హర్షనీయం.ప్రభుత్వం బిపిటి సన్న బియ్యం కిలో 49 రూపాయలకు విక్రయిస్తూ ఉంది. అదేవిధంగా గత కొంతకాలంగా ఉల్లి ధరలు విపరీతంగా పెరిగాయి.ఓపెన్ మార్కెట్లో కిలో ఉల్లి ధర 55 నుంచి 70 రూపాయల వరకు ఉంది. రాష్ట్ర ప్రభుత్వం రైతు బజార్ల ద్వారా కిలో 35 రూపాయలకు అందిస్తోంది.కానీ వేంపల్లి రైతు బజార్ లో ఇంతవరకు ప్రభుత్వం సన్నబియ్యం, ఉల్లి ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేయలేదు. వెంటనే ఏర్పాటు చేసి సామాన్య ప్రజలను ఆదుకోవాలని తులసి రెడ్డి రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.మీడియా సమావేశంలో కాంగ్రెస్ పార్టీ కిసాన్ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సింగం రామకృష్ణారెడ్డి, కడప జిల్లా కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు డాక్టర్ సుబ్రహ్మణ్యం,పులివెందుల నియోజకవర్గం సమన్వయకర్త ధ్రువ కుమార్ రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి అమర్నాథ్ రెడ్డి, బీసీ సెల్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఉత్తన్న తదితరులు పాల్గొన్నారు.

# బీసీల రాజకీయ, ఆర్థిక అభివృద్ధికి కూటమి ప్రభుత్వం కృషి: టీడీపీ నేతలు



రాయచోటి, మహిన్యూస్, అక్టోబర్ 13: బీసీల రాజకీయ ప్రాతినిధ్యాన్ని పెంపొందించడంతో పాటు, వారి ఆర్థిక అభివృద్ధికి కూటమి ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపడుతోందని టీడీపీ మండల అధ్యక్షుడు గండికోట సుధాకర్, సంబేపల్లి మండల క్లస్టర్ ఇన్‌చార్జి విష్ణువర్ధన్ రెడ్డి తెలిపారు. రాయచోటిలోని మండిపల్లి భవన్‌లో వారు మీడియాతో మాట్లాడుతూ, 1987లో దివంగత నందమూరి తారక రామారావు స్థానిక సంస్థల్లో బీసీలకు 20 శాతం రిజర్వేషన్లు కల్పించి, గ్రామస్థాయి నుంచి బీసీ నాయకత్వం ఎదిగేందుకు పునాది వేశారని పేర్కొన్నారు. అనంతరం చంద్రబాబు నాయుడు రిజర్వేషన్లను 34 శాతానికి పెంచి బీసీల రాజకీయ ప్రాతినిధ్యాన్ని మరింత పెంచారని తెలిపారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో తదనంతరం వచ్చిన ప్రభుత్వాలు కూడా ఈ రిజర్వేషన్లను కొనసాగించాయని, అయితే గత వైసీపీ ప్రభుత్వ హయాంలో బీసీ రిజర్వేషన్లు 34 శాతం నుంచి 24 శాతానికి తగ్గడం వల్ల బీసీల రాజకీయ ప్రాతినిధ్యానికి నష్టం కలిగిందని ఆరోపించారు. రాజకీయ రిజర్వేషన్లతో పాటు బీసీ వృత్తుల అభివృద్ధికి కూటమి ప్రభుత్వం చర్యలు చేపడుతోందని, వడ్డెరలకు మైనింగ్ లీజుల్లో 33 శాతం కేటాయింపు, గీత కార్మికులకు ఎక్సైజ్ దుకాణాల్లో 10 శాతం కేటాయింపు, నేతన్నలకు చేయూత, ఉచిత విద్యుత్ పథకాలు, మత్స్యకారుల సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తున్నట్లు వివరించారు. సెలూన్లకు నెలకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్ అందిస్తున్నామని, దేవాలయాల్లో పనిచేస్తున్న నాయీ బ్రాహ్మణుల వేతనాన్ని నెలకు రూ.25,000కు పెంచి వారి కుటుంబాలకు అండగా నిలుస్తున్నామని తెలిపారు. బీసీల రాజకీయ, ఆర్థిక అభివృద్ధికి ప్రాధాన్యత ఇవ్వడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకుడు చెన్న కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

# మారనున్న గాలివీడు సంత రూపురేఖలు

## రూ.70 లక్షలతో మార్కెట్ యార్డు నిర్మాణం..



గాలివీడు: అక్టోబరు 13 (మహి న్యూస్): గాలివీడు మండల కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్ వెనుక భాగంలో నూతన మార్కెట్ యార్డు నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. మార్కెట్ యార్డు నిర్మాణానికి పంచాయతీరాజ్ నిధుల నుంచి రూ.70 లక్షలు కేటాయించగా, మంగళవారం లక్ష్మీప్రసాద్ రెడ్డి భూమిపూజ నిర్వహించారు. ఈ నిధులతో 10ఐ10 అడుగుల విస్తీర్ణంలో 166 షెడ్లు నిర్మించనున్నారు. వీటితోపాటు సిమెంట్ రహదారులు, డ్రైనేజీ కాలువలు, పార్కింగ్ తదితర సౌకర్యాలు కల్పించనున్నారు. రైతులు, కూరగాయల వ్యాపారులు, ప్రజలకు అనుకూలంగా ఉండేలా పనులు చేపట్టాలని లక్ష్మీప్రసాద్ రెడ్డి అధికారులకు సూచించారు.

### రైతుల కష్టాలకు పరిష్కారం

ఇప్పటివరకు సంతలో సరైన వసతులు లేక రైతులు, వ్యాపారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని లక్ష్మీప్రసాద్ రెడ్డి పేర్కొన్నారు. ఎండాకాలంలో కూరగాయలు వాడిపోవడం, వర్షాకాలంలో తడిసిపోవడం వల్ల రైతులు నష్టపోయే పరిస్థితులు ఉన్నాయన్నారు. ఎండ, వాన నుంచి పంట ఉత్పత్తులను కాపాడుకునేందుకు తాత్కాలిక ఏర్పాట్లు చేసుకోవాల్సి వస్తోందని తెలిపారు. ఈ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపడంతోపాటు రైతులు, వ్యాపారులకు మెరుగైన వసతులు కల్పించాలనే లక్ష్యంతో మార్కెట్ యార్డును నిర్మిస్తున్నట్లు వివరించారు. నిర్మాణం పూర్తయితే సంతకు వచ్చే రైతులు, వ్యాపారులకు సౌకర్యాలు మెరుగుపడనున్నాయి. ఈ కార్యక్రమంలో మండల కూటమి నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు, మండిపల్లి అభిమానులు, వివిధ గ్రామాల నాయకులు పాల్గొన్నారు.

# స్థానిక ఎన్నికల బరిలోకి టీడీపీ ఆశావహులు

## అభ్యర్థుల నుంచి దరఖాస్తుల స్వీకరణ.. పార్టీ నిర్ణయమే కీలకం: దీపక్ రెడ్డి



కడప, మహి న్యూస్ అక్టోబర్ 13: స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేయాలనుకుంటున్న తెలుగుదేశం పార్టీ ఆశావహుల నుంచి దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ ప్రారంభమైంది. కడప జిల్లా టీడీపీ కార్యాలయంలో స్థానిక సంస్థల ఎన్నికల పరిశీలకుడు దీపక్ రెడ్డి, జిల్లా అధ్యక్షుడు భూపేష్ రెడ్డి పార్టీ శ్రేణులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఎన్నికల్లో పోటీ చేయాలనే ఆసక్తి ఉన్న అభ్యర్థుల నుంచి దరఖాస్తులను స్వీకరించారు. ఆశావహులతో మాట్లాడి వారి అభిప్రాయాలు, ఆయా ప్రాంతాల్లోని స్థానిక పరిస్థితులు, ఎన్నికలకు సంబంధించిన అంశాలను అడిగి తెలుసుకున్నారు.

### పార్టీ మార్గదర్శకాల మేరకే ఎంపిక

అభ్యర్థుల ఎంపికలో పార్టీ నిర్ణయమే ప్రాధాన్యంగా ఉంటుందని దీపక్ రెడ్డి తెలిపారు. పార్టీ మార్గదర్శకాలు, నాయకత్వం తీసుకునే నిర్ణయాలకు అనుగుణంగా అభ్యర్థుల ఎంపిక ప్రక్రియ కొనసాగుతుందని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయకత్వంపై, కూటమిపై నమ్మకంతో స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేసేందుకు అధిక సంఖ్యలో ఆశావహులు దరఖాస్తులు చేసుకోవడం సంతోషకరమని ఆయన అన్నారు.

### వైకాపాపై దీపక్ రెడ్డి విమర్శలు

స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేసేందుకు వైకాపాకు అభ్యర్థులు కూడా లేని పరిస్థితి నెలకొందని దీపక్ రెడ్డి విమర్శించారు. పార్టీ శ్రేణులు ఎన్నికలకు సిద్ధమవుతూ, పార్టీ నిర్ణయాలకు అనుగుణంగా ముందుకు సాగాలని ఈ సందర్భంగా సూచించారు.

# ప్రత్యేక అవసరాలు కలిగిన బాలికల సంరక్షణకు ముందడుగు!

## బాలికల కోసం ప్రత్యేక సంరక్షణ గృహాల నిర్వహణకు స్వచ్ఛంద సంస్థల నుంచి దరఖాస్తుల ఆహ్వానం

## అక్టోబర్ 31 వరకు దరఖాస్తుల స్వీకరణ

కడప జిల్లా, మహి న్యూస్, అక్టోబర్ 13: ప్రత్యేక అవసరాలు కలిగిన బాలికలకు రక్షణ, సంరక్షణ, అవసరమైన సదుపాయాలు కల్పించే లక్ష్యంతో కడప జిల్లాలోని మహిళా, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ప్రత్యేక బాలికల సంరక్షణ గృహం నిర్వహణకు స్వచ్ఛంద సేవా సంస్థల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నారు. అర్హత కలిగిన సంస్థలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని అధికారులు సూచించారు.

### అధికారిక అంతర్జాల వేదికలో వివరాలు

ప్రత్యేక బాలికల సంరక్షణ గృహం నిర్వహణకు సంబంధించిన మార్గదర్శకాలు, నిబంధనలు, ఇతర వివరాలను కడప జిల్లా అధికారిక అంతర్జాల వేదిక ఌఌఌ.ఝఝజూఖ.అఙఎ.అఅ ద్వారా తెలుసుకోవచ్చని ప్రకటనలో పేర్కొన్నారు. ఆసక్తి కలిగిన స్వచ్ఛంద సంస్థలు నిబంధనలను పూర్తిగా పరిశీలించి దరఖాస్తులు సమర్పించాలి.

### అక్టోబర్ 31 వరకు గడువు

దరఖాస్తుల సమర్పణకు 2026 అక్టోబర్ 31వ తేదీ సాయంత్రం 5 గంటల వరకు గడువు విధించారు. నిర్ణీత గడువులోగా సంబంధిత అధికారులకు దరఖాస్తులు అందజేయాలి.

### సంబంధిత కార్యాలయంలో దరఖాస్తుల సమర్పణ

దరఖాస్తులను కడప జిల్లా మహిళా, శిశు సంక్షేమ సాధికారత అధికారి కార్యాలయంలో సమర్పించాలి. మహిళా అభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఈ ప్రక్రియ కొనసాగనుంది. నిర్ణీత గడువు ముగిసిన తర్వాత అందే దరఖాస్తులను పరిగణనలోకి తీసుకోబోమని ప్రకటనలో స్పష్టం చేశారు. ఈ మేరకు జిల్లా మహిళా, శిశు సంక్షేమ సాధికారత అధికారి పి. రామదేవి ప్రకటన విడుదల చేశారు.

# ఈపీఎఫ్ఓ వేతన పరిమితి రూ.25 వేలకు పెంపు!

## కొత్తగా అర్హత పొందిన ఉద్యోగులకు పీఎఫ్ పరిధిలోకి వచ్చే అవకాశం

కడప, మహి న్యూస్, అక్టోబర్ 13: ఉద్యోగుల భవిష్య నిధి చందాదారులకు సంబంధించి వేతన పరిమితిని నెలకు రూ.15 వేల నుంచి రూ.25 వేలకు పెంచినట్లు పేర్కొంటూ ఈపీఎఫ్ఓ ప్రాంతీయ కార్యాలయం పత్రికా ప్రకటన విడుదల చేసింది. ఈ మార్పు 2026 సెప్టెంబర్ 17 నుంచి అమల్లోకి వచ్చినట్లు ప్రకటనలో వెల్లడించింది. కొత్త వేతన పరిమితి అమలుతో ఇప్పటివరకు ఉద్యోగుల భవిష్య నిధి పరిధిలోకి రాని మరికొందరు ఉద్యోగులకు కూడా పీఎఫ్ సదుపాయం పొందే అవకాశం కలుగుతుందని ప్రకటనలో వివరించారు. ఉద్యోగుల భవిష్య నిధి, ఉద్యోగుల పెన్షన్ పథకం, ఉద్యోగుల డిపాజిట్ అనుసంధాన బీమా పథకం వంటి ప్రయోజనాలు అర్హులకు అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.

### ఉద్యోగుల వివరాల నమోదు తప్పనిసరి

సంస్థలు తమ ఉద్యోగుల రికార్డులను సరిచూసి, అర్హులైన ఉద్యోగులను ఈపీఎఫ్ఓ పరిధిలో నమోదు చేయాలని సూచించారు. ఉద్యోగుల విశ్వవ్యాప్త ఖాతా సంఖ్య, ఆధార్, బ్యాంకు ఖాతా వివరాలు, నెలవారీ చందాలకు సంబంధించిన వివరాలను సక్రమంగా నమోదు చేయాలని పేర్కొన్నారు. చందాల వివరాలను ఎలక్ట్రానిక్ చలాన్ కమ్ రిటర్న్ ద్వారా సమర్పించాలని సూచించారు.

### అక్టోబర్ 31 వరకు నమోదు అవకాశం

కొత్త నిబంధనల ప్రకారం అర్హత పొందిన ఉద్యోగులను గుర్తించి, వారి వివరాలను నమోదు చేయాలని ప్రకటనలో పేర్కొన్నారు. కొత్తగా అర్హత పొందిన ఉద్యోగుల చందాలను జమ చేసేందుకు సంబంధిత సంస్థలు నిర్ణీత గడువులోపు ప్రక్రియ పూర్తి చేయాలని సూచించారు. ప్రకటన ప్రకారం ఈ నమోదు ప్రక్రియకు 2026 అక్టోబర్ 15 నుంచి అక్టోబర్ 31 వరకు అవకాశం కల్పించారు.

### యాజమాన్యాలకు ఈపీఎఫ్ఓ సూచన

అర్హులైన ఉద్యోగులందరికీ సామాజిక భద్రతా ప్రయోజనాలు అందేలా యాజమాన్యాలు సహకరించాలని ఈపీఎఫ్ఓ ప్రాంతీయ కార్యాలయం సూచించింది. ఉద్యోగుల వివరాలను సక్రమంగా నమోదు చేసి, వర్తించే చందాలను నిర్ణీత సమయంలో జమ చేయాలని తెలిపింది ఈ మేరకు కడప ప్రాంతీయ భవిష్య నిధి కమిషనర్ సి. రవితేజ కుమార్ రెడ్డి పేరుతో పత్రికా ప్రకటన విడుదలైంది.

# జమాలుల్లా బాబా దర్గాలో నూతన బోరు ప్రారంభం



రాయచోటి, మహిన్యూస్, అక్టోబర్ 13: రాయచోటి పట్టణంలోని పాత రాయచోటిలో ప్రసిద్ధిగాంచిన జమాలుల్లా బాబా దర్గాలో నూతన బోరును డాక్టర్ లక్ష్మీప్రసాద్ రెడ్డి ప్రారంభించారు. దర్గా ప్రాంగణంలో నీటి సౌకర్యం లేక ప్రార్థనల కోసం వచ్చే ముస్లిం సోదరులు, సోదరీమణులు ఇబ్బందులు ఎదుర్కొంటున్న విషయాన్ని దర్గా కమిటీ సభ్యులు డాక్టర్ లక్ష్మీప్రసాద్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై వెంటనే స్పందించిన ఆయన బోరు బండిని పంపించి నూతన బోరు వేయించడంతో దర్గాలో నీటి సౌకర్యం అందుబాటులోకి వచ్చింది. ఈ సందర్భంగా దర్గా కమిటీ సభ్యులు రాష్ట్ర మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి, డాక్టర్ లక్ష్మీప్రసాద్ రెడ్డికి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం డాక్టర్ లక్ష్మీప్రసాద్ రెడ్డి, గాజుల ఖాదర్‌బాషాలను శాలువాలతో ఘనంగా సత్కరించారు. ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి, మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి, డాక్టర్ లక్ష్మీప్రసాద్ రెడ్డి ఆధ్వర్యంలో రాయచోటి మరింత అభివృద్ధి చెందాలని, వారు ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకుడు, సంఘసేవకుడు మైనుద్దీన్, స్కూల్ అభివృద్ధి కమిటీ చైర్మన్ బర్కత్, తెలుగుదేశం పార్టీ 19వ వార్డు అధ్యక్షుడు సాగీర్, అమీర్ భాష, రఫీ తదితరులు పాల్గొన్నారు.

# నాలుగోసారి కాంగ్రెస్ ఓడిపోవడం ఖాయం.. అమిత్‌షా



న్యూఢిల్లీ: ఎస్ఐఆర్ కంటే ముందు కాంగ్రెస్ ఎన్ని ఎన్నికల్లో గెలిచిందని కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా ప్రశ్నించారు. ప్రజల మద్దతు కోసం రాహుల్ ఇష్టారీతిన అబద్ధాలు చెబుతున్నారన్నారు. ఇండి కూటమి నేతలపై మంగళవారం తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తూ మాట్లాడారు.రాహుల్ దురుద్దేశంతోనే ఎస్ఐఆర్ ప్రక్రియపై తప్పుడు ప్రచారం చేస్తున్నారని 2029 ఎ?న్నికల్లో ప్రజలు ఎవరివైపు ఉంటారో తేల్చుకుందామని కాంగ్రెస్ కు సవాల్ విసిరారు. రాహుల్ గాంధీతో పాటు కాంగ్రెస్ మిత్రపక్షాలు 2029 సార్వత్రిక ఎన్నికల్లో మరో ఘోర పరాజయానికి సిద్ధంగా ఉండాలని అమిత్ షా హెచ్చరించారు. వచ్చే ఎన్నికల్లో కూడా ఎన్డీఏ పూర్తి మెజారిటీతో అధికారంలోకి రాబోతోందని, కాంగ్రెస్‌కు వరుసగా ఇది నాలుగో ఓటమి కాబోతోందని జోస్యం చెప్పారు. రాహుల్ గాంధీ ఎస్ఐఆర్ ప్రక్రియను వ్యతిరేకించడం వెనుక ఉన్న అసలు ఉద్దేశం చొరబాటుదారులను రక్షించడమేనని అమిత్ షా ఆరోపించారు. కాంగ్రెస్ ఆడుతున్న ఈ రాజకీయ రంగులను దేశ ప్రజలు పూర్తిగా అర్థం చేసుకున్నారని, వారి మాటలను నమ్మే పరిస్థితిలో లేరని అన్నారు. రాజ్యాంగ సంస్థలపై బురదజల్లడం రాహుల్‌కు అలవాటుగా మారిందని ఎన్నికల్లో ఓడిపోయిన ప్రతిసారీ ఆత్మపరిశీలన చేసుకోకుండా... ఎన్నికల సంఘం, ఈవీఎంలు లేదా సుప్రీంకోర్టు వంటి రాజ్యాంగ సంస్థలపై బురదజల్లడం ఏంటని ప్రశ్నించారు. ప్రజల మద్దతు కోల్పోయిన రాహుల్ గాంధీ, కేవలం దురుద్దేశంతోనే ఇష్టారీతిన అబద్ధాలు ప్రచారం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

# యువతరం ఉద్యమిస్తోంది.. అధికారం దిగివస్తోంది!

సోషల్ మీడియా నుంచి వీధిపోరాటం వరకు జెన్‌జీ పరుగులు

గత రెండేళ్లలో 39 దేశాల్లో యువత నేతృత్వంలో నిరసనలు

అమరావతి: చేతిలో స్మార్ట్‌ఫోన్.. సోషల్ మీడియాలో ప్రచారం.. వీధుల్లో నిరసనలు.. ఇదీ నేటి యువత పోరాట తీరు. అవినీతి, నిరుద్యోగం, ధరల పెరుగుదల, ప్రభుత్వాల వైఫల్యాలపై యువత గళమెత్తుతోంది. విద్యార్థులతో మొదలైన ఆందోళనలు ప్రభుత్వాలనే కదిలిస్తున్నాయి. కొన్నిచోట్ల ప్రధానులు, అధ్యక్షులు పదవులు వదులుకోవాల్సి వస్తుండగా.. మరికొన్ని దేశాల్లో ప్రభుత్వాలు ప్రజావ్యతిరేక నిర్ణయాలను వెనక్కి తీసుకుంటున్నాయి. మనదేశంలో నీట్ పేపర్ లీకేజీ వ్యవహారంలో ఏకంగా కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ చేత రాజీనామా చేయించాయి కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) నేతృత్వంలోని ఈ బొద్దింకలు ఇప్పుడు ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానాష్ కుమార్ రాజీనామా చేయాలంటూ దేశ రాజధానితో పాటు అన్ని రాష్ట్రాల్లోను జెన్‌జీ ఆందోళన నిర్వహిస్తోంది. ఏపీలోనూ మెగా డీఎస్సీ కుంభకోణానికి వ్యతిరేకంగా యువత తాజాగా ఉద్యమించింది.ఈ నేపథ్యంలో గేట్‌వే హౌస్ ఈ నెల 8న ప్రచురించిన 'ది అవుట్‌కమ్స్ ఆఫ్ గ్లోబల్ యూత్ మూవ్‌మెంట్స్' అధ్యయనం ఈ పరిణామాలపై ఆసక్తికర విషయాలను బయటపెట్టింది. 2024 జనవరి నుంచి 2026 జూన్ వరకు 39 దేశాల్లో యువత నేతృత్వంలో నిరసనలు నమోదైనట్లు వెల్లడించింది. వీటిలో 19 దేశాల్లో ప్రభుత్వాలు నిరసనకారుల డిమాండ్లకు కొంతమేర అంగీకరించడం, విధాన నిర్ణయాలను మార్చడం లేదా అధికారులు రాజీనామా చేయడం వంటి పరిణామాలు జరిగాయి. నాలుగు దేశాల్లో ఉద్యమాల ఫలితాలు ఇంకా తేలలేదు. అయితే కౌన్సిల్ ఆన్ ఫారిన్ రిలేషన్స్ (సీఎఫ్ఆర్) విశ్లేషణ ప్రకారం.. యువత ఉద్యమం ప్రభుత్వాన్ని ప్రభావితం చేయగలిగినా, ఆ తర్వాత అవినీతిని తగ్గించడం, ఆర్థికవ్యవస్థను మెరుగుపరచడం, వ్యవస్థాగత సంస్కరణలు అమలు చేయడం వంటి సవాళ్లు కొనసాగుతూనే ఉన్నాయి.

### బంగ్లాదేశ్‌లో పాలనకు చరమగీతం

2024లో ప్రభుత్వ ఉద్యోగాల్లో రిజర్వేషన్లకు వ్యతిరేకంగా బంగ్లాదేశ్‌లో విద్యార్థులు ఉద్యమం చేపట్టారు. అవినీతి, అధికార దుర్వినియోగంపై యువత గళమెత్తింది. నిరసనలు ఉధృతం కావడంతో అప్పటి ప్రధాని షేక్ హసీనా దేశం విడిచి వెళ్లాల్సి వచ్చింది. ఆమె సుదీర్ఘపాలన ముగిసింది.

### శ్రీలంకలో అధ్యక్షుడి రాజీనామా

2022లో శ్రీలంక తీవ్రమైన ఆర్థిక సంక్షోభాన్ని ఎదుర్కొంది.



ఇంధనం, ఆహారం, మందుల కొరత ప్రజలను ఇబ్బందులకు గురిచేసింది. ప్రభుత్వ వైఫల్యాలపై యువతతో పాటు ప్రజలు 'అరగలయ' పేరుతో ఉద్యమించారు. నిరసనలు దేశవ్యాప్తంగా విస్తరించడంతో అధ్యక్షుడు గొటబాయ రాజపక్స రాజీనామా చేశారు.

### నేపాల్‌లో జెన్‌జీ ప్రకంపనలు

2025లో నేపాల్‌లో సోషల్ మీడియా వేదికలపై నిషేధం, అవినీతి, రాజకీయ నాయకుల కుటుంబాల విలాసవంతమైన జీవనశైలిపై యువత నిరసనలకు దిగింది. పోలీసుల కాల్పుల్లో నిరసనకారులు మరణించడంతో ఆందోళనలు మరింత ఉధృతమయ్యాయి. దేశవ్యాప్తంగా నిరసనలు విస్తరించడంతో ప్రధాని కేపీ శర్మ ఓలీ రాజీనామా చేశారు.

### కెన్యాలో పన్నుల బిల్లుకు బ్రేక్

2024లో కెన్యా ప్రభుత్వం ప్రతిపాదించిన పన్నుల పెంపునకు వ్యతిరేకంగా యువత పెద్ద ఎత్తున నిరసనలు చేపట్టింది. సోషల్ మీడియా ద్వారా సమీకరణ, వీధుల్లో ఆందోళనలతో ప్రభుత్వం ఒత్తిడికి గురైంది. అధ్యక్షుడు విలియం రూటో ప్రతిపాదిత ఆర్థిక బిల్లును వెనక్కి తీసుకున్నారు. అనంతరం మంత్రివర్గంలో భారీ మార్పులు చేపట్టారు.

### మరికొన్ని దేశాల్లోనూ ఇదే తీరు

ఇండోనేషియా: 2025లో ఎంపీలకు అదనపు భత్యాలపై నిరసనలు వెల్లువెత్తడంతో ప్రభుత్వం ఆ ప్రయోజనాలకు సంబంధించిన నిర్ణయాలను వెనక్కి తీసుకుంది.

మడగాస్కర్: నీరు, విద్యుత్ సమస్యలు, అవినీతిపై యువత ఆందోళనలు చేపట్టింది. నిరసనల అనంతరం అధ్యక్షుడు ఆండ్రి రాజోలినా అధికారాన్ని కోల్పోయారు.

ఫిలిప్పీన్స్, పెరూ: 2025లో పెద్ద ఎత్తున నిరసనల నేపథ్యంలో ఉన్నతస్థాయి ప్రభుత్వ అధికారులు రాజీనామా చేసినట్లు సీఎఫ్ఆర్ విశ్లేషణ పేర్కొంది.

తైమూర్--లెస్టే: పార్లమెంటు సభ్యులకు ప్రత్యేక ప్రయోజనాలు, మాజీ ప్రజాప్రతినిధులకు జీవితకాల పెన్షన్లపై వ్యతిరేకత వ్యక్తమవడంతో ప్రభుత్వం ఆ ప్రయోజనాలను రద్దు చేసింది.

యూనిసెఫ్ అధ్యయనంలో కీలక అంశాలు

యూనిసెఫ్ ఇన్నోసెంటీ కార్యాలయం 2024 మార్చిలో ప్రచురించిన యూత్, ప్రొటెస్ట్స్ అండ్ ది పాలీక్రైసిస్ నివేదిక యువత నిరసనల వెనుక ఉన్న కారణాలు, వాటి ప్రభావాలను విశ్లేషించింది. ఈ అధ్యయనం ప్రకారం..

' యువత సంప్రదాయ రాజకీయ మార్గాల కంటే నిరసనలు, ప్రత్యక్ష కార్యాచరణ ద్వారా తమ అభిప్రాయాలను వ్యక్తం చేయడానికి ఎక్కువగా మొగ్గు చూపుతోంది.

' రాజకీయ, ఆర్థిక, సామాజిక, పర్యావరణ సమస్యలు యువతను ఉద్యమాల వైపు నడిపిస్తున్నాయి.

' డిజిటల్ వేదికలు నిరసనకారులను సమీకరించడంలో, సమాచారాన్ని వేగంగా వ్యాప్తిచేయడంలో కీలకపాత్ర పోషిస్తున్నాయి.

' యువత భాగస్వామ్యంతో జరిగే ఉద్యమాలు ఎక్కువమందిని కలుపుకొని సాగడం, వినూత్న పద్ధతులను ఉపయోగించడం వల్ల ప్రభావవంతంగా మారే అవకాశముంది.

' ఉద్యమం విజయవంతమైనా యువతకు ప్రత్యక్షంగా ఉద్యోగాలు, మెరుగైన జీవన ప్రమాణాలు వంటి ప్రయోజనాలు అందుతాయని హామీలేదని నివేదిక హెచ్చరించింది.

### సోషల్ మీడియా నుంచి వీధి పోరాటం వరకు

ప్రస్తుత యువత ఉద్యమాల్లో సోషల్ మీడియా కీలక సాధనంగా మారిందని గేట్‌వే హౌస్ అధ్యయనం పేర్కొంది. వాట్సప్, ఇన్‌స్టాగామ్, ఫేస్‌బుక్, ఎక్స్, టెలిగ్రామ్, యూట్యూబ్ వంటి సామాజిక వేదికల ద్వారా ప్రచారం, సమీకరణ సాగుతున్నాయని వివరించింది. అనేక ఉద్యమాలకు ఒకే నాయకత్వం ఉండకపోవడం, స్థానిక సమస్యల ఆధారంగా ప్రజలు స్వచ్ఛందంగా సమీకృతం కావడం మరో ప్రత్యేకతగా గుర్తించింది. అయితే అన్ని ఉద్యమాలు ఒకే విధమైన ఫలితాలను సాధించలేదు. కొన్ని ప్రభుత్వాలను మార్చగా.. మరికొన్ని విధానాల ఉపసంహరణతోనే ఆగిపోయాయి. ఇంకొన్ని దేశాల్లో నిరసనకారుల డిమాండ్లను ప్రభుత్వాలు పట్టించుకోలేదు. అందువల్ల సోషల్ మీడియా ప్రచారంతో పాటు విస్తృత ప్రజామద్దతు, స్పష్టమైన డిమాండ్లు, ప్రజాస్వామ్యసంస్థల సహకారం కూడా కీలకమని అధ్యయనాలు సూచిస్తున్నాయి.

# బీసీలకు న్యాయం చేసింది వైఎస్ జగన్ మాత్రమే.. మార్గాని భరత్

తాడేపల్లి: బీసీ రిజర్వేషన్ల విషయంలో చంద్రబాబు మాటలకు, చేతలకు పొంతన లేదని మాజీ ఎంపీ మార్గాని భరత్ అన్నారు. బీసీలకు మేలు చేసింది మాజీ ముఖ్యమంత్రి వైఎస్సార్సీపీ అధినేత వైఎస్ జగన్ మాత్రమేనని.. గతంలోనే 34 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ జగన్ ప్రభుత్వం జీవో జారీ చేసిందని తెలిపారు. ఈ రోజు మంగళవారం తాడేపల్లిలో ఆయన మీడియా సమావేశం నిర్వహించారు. చంద్రబాబు బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు దక్కకుండా చేశారని ధ్వజమెత్తారు. భరత్ మాట్లాడుతూ.. చంద్రబాబు బిర్రు ప్రతాప్ రెడ్డితో కోర్టులో కేసు వేయించారు. బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు దక్కకుండా చేశారు. బిర్రు ప్రతాప్ రెడ్డికి టీడీపీతో సంబంధం లేదని చంద్రబాబు చెప్పగలరా?చంద్రబాబు హయాంలో బిర్రు ప్రతాప్ రెడ్డికి ప్రభుత్వంలో కీలకమైన పోస్టులు కట్టబెట్టారు. చంద్రబాబు, నారా లోకేష్‌లతో బిర్రు ప్రతాప్ రెడ్డికి సన్నిహిత సంబంధాలున్నాయిటీడీపీతో సంబంధాలున్న వ్యక్తి కోర్టులో కేసు వేస్తే, ఆ పార్టీ అప్పుడే ఎందుకు అడ్డుకోలేదు? హైకోర్టులో కేసు విచారణ సమయంలో టీడీపీ ఎందుకు ఇంప్లీడ్ కాలేదు? అని చంద్రబాబు నాయుడుని ప్రశ్నించారు. హైకోర్టు తీర్పు తర్వాత రామ్మోహన్ నాయుడుతో సుప్రీంకోర్టులో పిటిషన్ వేయించడం రాజకీయ నాటకం కాదా? బీసీలకు అన్యాయం చేసి, తిరిగి వైఎస్సార్సీపీపై నిందలు వేయడం చంద్రబాబు ద్వంద్వ వైఖరికి నిదర్శనమన్నారు. వైఎస్సార్సీపీ హయాంలో 13 జెడ్పీ చైర్మన్ పదవుల్లో ఆరు బీసీలకు కేటాయించాం. 14 మున్సిపల్ కార్పొరేషన్లలో తొమ్మిది మేయర్ పదవులు బీసీలకు ఇచ్చాం.మండల పరిషత్ అధ్యక్ష పదవుల్లో 67 శాతం బీసీలకు అవకాశాలు కల్పించాం. 137 ప్రభుత్వ కార్పొరేషన్లలో 53 కార్పొరేషన్లకు బీసీలను చైర్మన్లుగా నియమించాం.బీసీల సాధికారత కోసం ప్రత్యేకంగా 56 బీసీ కార్పొరేషన్లను ఏర్పాటు చేశామని బీసీలకు రాజకీయ పదవుల కేటాయింపులో వైఎస్సార్సీపీతో పోటీ పడగలరా చంద్రబాబు కాని అతని కుమారుడు లోకేష్ గానీ పోటీ పడగలరా అని నిలదీశారు. బీసీలకు నిజంగా న్యాయం చేయాలంటే రాష్ట్రవ్యాప్తంగా సమగ్ర బీసీ జనగణన చేపట్టాలి. బీసీ జనాభా దామాషా ప్రకారం రిజర్వేషన్ల కోసం అసెంబ్లీలో చట్టం చేయాలి. కేంద్రంలో టీడీపీ మద్దతుతో ప్రభుత్వం కొనసాగుతున్నప్పుడు బీసీ రిజర్వేషన్లపై రాజ్యాంగ సవరణకు ఎందుకు ప్రయత్నించరు?బీసీలకు న్యాయం చేయాలనే చిత్తశుద్ధి ఉంటే పార్లమెంటులో రాజ్యాంగ సవరణ కోసం చంద్రబాబు కృషి చేయాలని బీసీలకు ఎవరు మేలు చేశారో, ఎవరు అన్యాయం చేశారో ప్రజలందరికీ తెలుసని మార్గాని భరత్ అన్నారు.

RNI : APTEL/25/A0108
www.mahinewsindia.com
మహి న్యూస్
తెలుగు దినపత్రిక
epaper: https://epaper.mahinewsindia.com
ఉమ్మడి గుంటూరు జిల్లా
బుధవారం - 14 - అక్టోబర్ - 2026

# స్థానిక సంస్థల ఎన్నికలు పారదర్శకంగా నిర్వహించాలి

### ఎన్నికల నిబంధనలు, రాష్ట్ర ఎన్నికల సంఘం మార్గదర్శకాలు తప్పనిసరిగా పాటించాలి



గుంటూరు, అక్టోబర్ 13: (మహి న్యూస్): స్థానిక సంస్థల ఎన్నికలను పారదర్శకంగా, ప్రశాంత వాతావరణంలో నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జి. సాయి ప్రసాద్ అధికారులను ఆదేశించారు. మంగళవారం పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ, పురపాలక శాఖ ఉన్నతాధికారులు, జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి స్థానిక సంస్థల ఎన్నికల ఏర్పాట్లపై సమీక్షించారు. ఈ సందర్భంగా ప్రధాన కార్యదర్శి మాట్లాడుతూ ఎన్నికల నిబంధనలు, రాష్ట్ర ఎన్నికల సంఘం మార్గదర్శకాల ప్రకారమే ప్రతి అంశాన్ని అమలు చేయాలని స్పష్టం చేశారు. ఇప్పటికే వివిధ స్థానాలకు రిజర్వేషన్ల ప్రక్రియను ప్రకటించిన నేపథ్యంలో, వాటిని తప్పనిసరిగా పాటించాలని సూచించారు. ఎన్నికల ప్రక్రియలో ప్రతి అంశాన్ని జాగ్రత్తగా పరిశీలిస్తూ, సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో వ్యవహరించాలని ఆదేశించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా కలెక్టర్ సి.ఎం. సాయికాంత్ వర్మ, గుంటూరు నగరపాలక సంస్థ కమిషనర్ కె. మయూర్ అశోక్, జిల్లా రెవెన్యూ అధికారి ఎన్.ఎస్.కె. ఖాజావలి, జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణ అధికారి వి. జ్యోతి బసు, జిల్లా పంచాయతీ అధికారి బి.వి. నాగ సాయి కుమార్, తెనాలి మున్సిపల్ కమిషనర్ జె. రామ అప్పల నాయుడు తదితరులు పాల్గొన్నారు.

# "మార్పు" వసతి గృహాల పనులను త్వరితగతిన పూర్తి చేయాలి

### 36 వసతి గృహాల్లో మెరుగైన మౌలిక వసతులు కల్పించాలి

### సీసీ కెమెరాలు, రూఫ్‌టాప్ సోలార్ ఏర్పాటు చేయాలి



గుంటూరు, అక్టోబర్ 13: (మహి న్యూస్): "మార్పు" కార్యక్రమం కింద జిల్లాలో చేపట్టిన వసతి గృహాల అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ సి.ఎం. సాయికాంత్ వర్మ అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లో సంబంధిత అధికారులతో "మార్పు" కార్యక్రమం అమలుపై కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. జిల్లాలో 36 వసతి గృహాల్లో మెరుగైన మౌలిక వసతులు కల్పించడమే లక్ష్యంగా పనులు చేపట్టినట్లు తెలిపారు. విద్యార్థులకు ఆహ్లాదకరమైన వాతావరణం కల్పించేలా వసతి గృహాల రూపురేఖలు మార్చాలని సూచించారు. వసతి గృహాల ప్రవేశ ద్వారాలు, వంటగదుల్లో తప్పనిసరిగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. తాడికొండ, రాజా గార్డెన్‌లోని బీసీ వసతి గృహం, గురుకులాల్లో అభివృద్ధి పనులను వెంటనే ప్రారంభించాలని స్పష్టం చేశారు. వసతి గృహాల్లో రూఫ్‌టాప్ సోలార్ వ్యవస్థలను ఏర్పాటు చేయాలని సూచించారు. విద్యార్థులకు మెరుగైన వసతి సదుపాయాలు కల్పించడం ద్వారా ఆహ్లాదకరమైన వాతావరణం ఏర్పడి, వారి వ్యక్తిత్వ వికాసానికి దోహదపడుతుందని కలెక్టర్ తెలిపారు. సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి పనులను నిర్ణీత సమయంలో పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో జిల్లా నీటి యాజమాన్య సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ వి. శంకర్, జిల్లా సాంఘిక సంక్షేమ, గిరిజన సంక్షేమ సాధికారత అధికారి డి. దుర్గాబాయి, జిల్లా బీసీ సంక్షేమ శాఖ అధికారి కె. మయూరి, విభిన్న ప్రతిభావంతుల శాఖ సహాయ సంచాలకులు ఎన్. వెంకటరవణప్ప, రహదారులు భవనాల శాఖ కార్యనిర్వాహక ఇంజినీర్ సి. విశ్వనాథరెడ్డి, ఏపీఈడబ్ల్యూఐసీ కార్యనిర్వాహక ఇంజినీర్ అనిల్, హార్ట్‌ఫుల్‌నెస్ ఫౌండేషన్ డీపీఎం హారిక తదితరులు పాల్గొన్నారు.



# అగ్రిగోల్డ్ బాండ్ల పరిశీలనకు తేదీలు ఖరారు

### ప్రత్తిపాడు, వట్టిచెరుకూరు, చేబ్రోలు మండలాల బాధితులకు సూచన



గుంటూరు, అక్టోబర్ 13: (మహి న్యూస్): అగ్రిగోల్డ్ బాండ్ల పరిశీలనలో భాగంగా అక్టోబర్ 13న ప్రత్తిపాడు, వట్టిచెరుకూరు మండలాల నుంచి వచ్చిన 150 మంది వద్ద ఉన్న 310 అగ్రిగోల్డ్ బాండ్లను అధికారులు పరిశీలించారు. అక్టోబర్ 14న ప్రత్తిపాడు, వట్టిచెరుకూరు మండలాలకు చెందిన అగ్రిగోల్డ్ బాండ్ల పరిశీలన నిర్వహించనున్నారు. అదేవిధంగా అక్టోబర్ 15, 16 తేదీల్లో చేబ్రోలు మండలానికి చెందిన బాండ్‌దారుల బాండ్లను, బాండ్లపై నమోదైన చిరునామాల ఆధారంగా గుంటూరు రీజనల్ కార్యాలయం, సీఐడీ కార్యాలయంలో పరిశీలిస్తారు. సంబంధిత మండలాలకు చెందిన అగ్రిగోల్డ్ బాండ్‌దారులు ఈ తేదీలను గమనించి, తమకు కేటాయించిన రోజున గుంటూరులోని సీఐడీ రీజనల్ కార్యాలయానికి హాజరుకావాలని సీఐడీ గుంటూరు రీజనల్ అధికారి, అదనపు పోలీసు సూపరింటెండెంట్ బి. సీతారామయ్య తెలిపారు.





# మాచర్ల మున్సిపల్ చైర్‌పర్సన్ అభ్యర్థిగా యెనుముల సుష్మ రెడ్డికి మద్దతు తెలపాలి

### ఐవీఆర్ఎస్ కాల్ ద్వారా తమ అభిప్రాయాన్ని తెలియజేయాలని పిలుపు



మాచర్ల: మాచర్ల మున్సిపల్ చైర్‌పర్సన్ అభ్యర్థిగా యెనుముల కేశవ రెడ్డి సతీమణి యెనుముల సుష్మ రెడ్డికి అవకాశం కల్పించాలని కోరుతూ టీడీపీ మద్దతుదారులు ప్రజలకు పిలుపునిస్తున్నారు. మున్సిపల్ అభ్యర్థుల ఎంపిక ప్రక్రియలో భాగంగా ఐవీఆర్ఎస్ కాల్ వచ్చినప్పుడు సుష్మ రెడ్డి పేరుతో ఉన్న ఆప్షన్‌ను ఎంచుకుని తమ మద్దతు తెలియజేయాలని కోరుతున్నారు. మాచర్ల ప్రజల ఆకాంక్షలను ప్రతిబింబించేలా సుష్మ రెడ్డికి మద్దతు తెలపాలని, అభ్యర్థుల ఎంపికలో ప్రజలు తమ అభిప్రాయాన్ని స్పష్టంగా తెలియజేయాలని పేర్కొన్నారు. ఈ సందర్భంగా టీడీపీకి, మాచర్ల ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డికి, యెనుముల కేశవ రెడ్డికి మద్దతుగా నినాదాలు చేశారు.

# గ్యాస్ సబ్సిడీ సమస్యల పరిష్కారానికి ప్రత్యేక చర్యలు

### 24 గంటల్లోగా సంబంధిత వివరాలు అందించాలని గ్యాస్ ఏజెన్సీలకు ఆదేశాలు




మాచర్ల, అక్టోబర్ 13:(మహి న్యూస్): గ్యాస్ వినియోగదారులకు సబ్సిడీ నగదు బ్యాంకు ఖాతాల్లో జమ కాకపోవడంతో ఎదురవుతున్న ఇబ్బందులను పరిష్కరించేందుకు రెవెన్యూ అధికారులు చర్యలు చేపట్టారు. ప్రజాదర్బార్ కార్యక్రమంలో మాచర్ల శాసనసభ్యులు జూలకంటి బ్రహ్మానందరెడ్డి దృష్టికి పలువురు వినియోగదారులు ఈ సమస్యను తీసుకురావడంతో, ఆయన సూచనల మేరకు మంగళవారం మాచర్ల తహసీల్దారు కార్యాలయంలో సంబంధిత అధికారులతో సమావేశం నిర్వహించారు. తహసీల్దారు కిరణ్‌కుమార్ ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశంలో డిప్యూటీ తహసీల్దారు ఎస్.కె. బాషా, గ్యాస్ ఏజెన్సీల ప్రతినిధులు పాల్గొన్నారు. గ్యాస్ కనెక్షన్ల మొత్తం సంఖ్య, సబ్సిడీకి అర్హులైన వినియోగదారుల జాబితా, వారికి అందాల్సిన సబ్సిడీ మొత్తం, నగదు జమ కావడంలో జాప్యానికి గల సాంకేతిక కారణాలపై చర్చించారు. సంబంధిత వివరాలు, రికార్డులను 24 గంటల్లోగా తహసీల్దారు కార్యాలయానికి అందించాలని గ్యాస్ ఏజెన్సీల ప్రతినిధులను ఆదేశించారు. సబ్సిడీ నగదు జమ కాని వినియోగదారుల జాబితాను అందించాలని పల్నాడు జిల్లా పౌర సరఫరాల అధికారి (జిల్లా సరఫరాల అధికారి)ని తహసీల్దారు కోరారు. అదేవిధంగా వినియోగదారుల గుర్తింపు వివరాల నమోదు, ఇతర సాంకేతిక సమస్యలను పరిష్కరించేందుకు ప్రత్యేక కార్యక్రమం చేపట్టాలని ఉప తహసీల్దారు ఎస్.కె. బాషా, మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్‌ను ఆదేశించారు. అర్హులైన వినియోగదారులకు సబ్సిడీ నగదు అందేలా సమస్యలను గుర్తించి పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు అధికారులు తెలిపారు.

# కొర్నెపాడులో ప్రకృతి వ్యవసాయ పద్ధతులను పరిశీలించిన కలెక్టర్

### బయోచార్ తయారీ విధానాలపై రైతుల్లో అవగాహన పెంచాలి

### వ్యవసాయ ఆధారిత పరిశ్రమలతో మహిళలకు ఆర్థికాభివృద్ధి

గుంటూరు, అక్టోబర్ 13: (మహి న్యూస్): రైతుల భూముల ఆరోగ్యాన్ని మెరుగుపరిచేందుకు బయోచార్ తయారీ విధానాలను రైతుల్లో విస్తృతంగా ప్రచారం చేయాలని జిల్లా కలెక్టర్ సి.ఎం. సాయికాంత్ వర్మ సూచించారు. మంగళవారం వట్టిచెరుకూరు మండలం కొర్నెపాడు గ్రామంలోని రైతు నేస్తం ఫౌండేషన్‌ను కలెక్టర్ సందర్శించారు. అక్కడ ప్రకృతి వ్యవసాయంపై నిర్వహిస్తున్న శిక్షణ తరగతులు, ఐదు అంచెల సాగు విధానాలు, ఒంగోలు, కాంక్రీజ్, పుంగనూరు, సాహివాల్, గిర్ దేశీయ ఆవుల జాతుల గురించి తెలుసుకున్నారు. సేంద్రియ ఎరువులు, ఘన జీవామృతం, కషాయాలు, జీవామృతం తయారీ విధానాలను పరిశీలించారు. సమగ్ర వ్యవసాయంలో భాగంగా గొర్రెలు, మేకలు, కోళ్ల పెంపకంపై వివరాలు తెలుసుకున్నారు. ఆవు పేడ, మూత్రంతో ప్రమిదలు, ధూప్‌స్టిక్స్, పిడకలు, వినాయక ప్రతిమలు వంటి ఉత్పత్తుల తయారీని పరిశీలించారు. రైతు నేస్తం ఫౌండేషన్‌లో రెండు రోజులుగా శిక్షణ పొందుతున్న స్వయం సహాయక సంఘాల మహిళలతో కలెక్టర్ ముఖాముఖి మాట్లాడారు. వ్యవసాయ ఆధారిత పరిశ్రమలను స్థాపించి ఆర్థికంగా అభివృద్ధి చెందేందుకు ఉన్న అవకాశాలను అడిగి తెలుసుకున్నారు. ఫుడ్ ప్రాసెసింగ్ యంత్రాల పనితీరును పరిశీలించారు. టమాటా సాస్, అల్లం వెల్లుల్లి పేస్ట్ తయారీ యంత్రాలు, వేరుశెనగ విత్తనాలు వేరు చేసే యంత్రం, వెన్న తీసే యంత్రం, బూంది నుంచి నూనె వేరు చేసే యంత్రం, ఎద్దుల గానుగ ద్వారా నూనె తయారీ పరికరాలను చూశారు. పిండి వంటలు, చిరుధాన్యాల బిస్కెట్లు, గరం మసాలా తయారీ యంత్రాలతో పాటు వెజిటబుల్ కట్టర్, ప్యాకింగ్, వాక్యూమ్ ప్యాకింగ్ యంత్రాలు, మోడల్ ఆర్గానిక్ స్టోర్, బయో రీసెర్చ్ సెంటర్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయంపై రైతుల్లో మరింత అవగాహన పెంచాలని రైతు నేస్తం ఫౌండేషన్ చైర్మన్, పద్మశ్రీ పురస్కార గ్రహీత యడ్లపల్లి వెంకటేశ్వరరావును కోరారు. రైతులకు ఉపయోగపడే బయోచార్ తయారీ పద్ధతులను విస్తృతంగా ప్రచారం చేసి, భూసారాన్ని మెరుగుపరిచే చర్యలు చేపట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి ఎం. పద్మావతి, డీఆర్‌డీఏ ప్రాజెక్టు డైరెక్టర్ వి. విజయలక్ష్మి, ప్రకృతి వ్యవసాయ డీపీఎం రాజకుమారి, నాబార్డ్ డీడీఎం శరత్, ఎల్‌డీఎం మహిపాల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.










# ఎరువుల సరఫరాలో ఎలాంటి సమస్యలు ఉండరాదు

### రైతులకు సకాలంలో ఎరువులు అందించాలి

### ప్రకృతి వ్యవసాయంపై రైతుల్లో అవగాహన పెంచాలి



గుంటూరు, అక్టోబర్ 13: (మహి న్యూస్): రైతులకు ఎరువుల సరఫరాలో ఎలాంటి సమస్యలు తలెత్తకుండా అవసరమైన చర్యలు తీసుకోవాలని జాయింట్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లో ప్రాథమిక రంగాలపై సంబంధిత శాఖల అధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు. యూరియా, ఇతర ఎరువుల డిమాండ్‌ను ముందుగానే అంచనా వేసి, అందుకు అనుగుణంగా సరఫరా చర్యలు చేపట్టాలని సూచించారు. ఎరువుల పంపిణీ ఎయిమ్స్ యాప్ ద్వారా జరగాలని, రైతుల ఈ-కేవైసీ ప్రక్రియను త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. వ్యవసాయ అధికారులు, సిబ్బంది పనితీరును మెరుగుపరుచుకోవాలని, రైతు సంక్షేమమే లక్ష్యంగా ప్రాథమిక రంగాల శాఖలు పనిచేయాలని స్పష్టం చేశారు. రైతులకు సకాలంలో సూచనలు, సలహాలు అందించడం ద్వారా పంటల సాగు, పశువుల పోషణ మెరుగుపడి వారు ఆర్థికంగా బలోపేతం కావడానికి అవకాశం ఉంటుందని తెలిపారు. ఆవులు, గేదెల పెంపకం ద్వారా పాల ఉత్పత్తిని పెంచడంతో పాటు కోళ్లు, మేకల పెంపకం ద్వారా రైతులకు అదనపు ఆదాయం లభించేలా ప్రోత్సహించాలని సూచించారు. ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలను సాధించడంలో నిర్లక్ష్యం వహించరాదన్నారు. ప్రకృతి వ్యవసాయం వైపు ఎక్కువ మంది రైతులు మళ్లేలా చర్యలు తీసుకోవాలని, ముఖ్యమంత్రి ప్రకృతి వ్యవసాయానికి అధిక ప్రాధాన్యత ఇస్తున్నారని పేర్కొన్నారు. జిల్లా వ్యవసాయ అధికారి ఎం. పద్మావతి మాట్లాడుతూ జిల్లాలో ఈ-పంట నమోదు 97 శాతం పూర్తయిందని, నిర్దేశించిన లక్ష్యాన్ని పూర్తి చేస్తామని తెలిపారు. కరువు లెక్కల సేకరణలో సిబ్బంది నిమగ్నం కావడంతో కొంత జాప్యం జరిగిందన్నారు. సీసీఆర్సీ బీమా ప్రక్రియ వంద శాతం పూర్తయిందని, ఎస్సీ లబ్ధిదారులకు మూడు డ్రోన్లు రావాల్సి ఉందని వివరించారు. మార్క్‌ఫెడ్ జిల్లా మేనేజర్ టి. నరసింహారెడ్డి మాట్లాడుతూ జిల్లాలో యూరియా, ఇతర ఎరువుల కొరత లేదని తెలిపారు. ప్రకృతి వ్యవసాయం డీపీఎం రాజకుమారి మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయం కింద 49,620 ఎకరాల్లో 44,029 మంది రైతులతో సాగు చేపట్టేలా లక్ష్యాలు నిర్దేశించినట్లు వివరించారు. ఈ సమావేశంలో ఉద్యాన శాఖ ఉప సంచాలకులు, ఏపీఎంఐపీ పీడీ ఎల్. వజ్రశ్రీ, పశుసంవర్ధక శాఖ సంయుక్త సంచాలకులు కె.వి.వి. సత్యనారాయణ, వ్యవసాయ మార్కెటింగ్ శాఖ సహాయ సంచాలకులు పి. సత్యనారాయణ చౌదరి తదితరులు పాల్గొన్నారు.

# నూతన క్యూఆర్ కోడ్ విధానాన్ని రద్దు చేయాలి

### - తహశీల్దార్ వర కుమార్ కు రేషన్ డీలర్ల వినతి



దుర్గి, అక్టోబర్ 13:(మహి న్యూస్): రేషన్ సరుకుల బస్తాలకు ప్రభుత్వం నూతనంగా ప్రవేశపెట్టిన క్యూఆర్ కోడ్ స్కానింగ్ విధానం వల్ల క్షేత్రస్థాయిలో తీవ్ర సాంకేతిక సమస్యలు, పనిభారం ఎదురవుతున్నాయని, ఈ విధానాన్ని తక్షణమే నిలిపివేయాలని డిమాండ్ చేస్తూ దుర్గి మండల రేషన్ డీలర్ల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో మంగళవారం తహశీల్దార్ వర కుమార్ వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా డీలర్ల ప్రతినిధులు మాట్లాడుతూ, గ్రామీణ ప్రాంతాలలో నెట్‌వర్క్ సమస్యల వల్ల క్యూఆర్ కోడ్ స్కాన్ చేయడం తీవ్ర ఇబ్బందిగా మారిందని, దీనివల్ల సరుకుల పంపిణీ ఆలస్యమవడమే కాకుండా లబ్ధిదారులు గంటల తరబడి వేచి ఉండాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు.

**డీలర్ల ప్రధాన డిమాండ్లు:**

1. సాంకేతిక ఇబ్బందులకు కారణమవుతున్న నూతన క్యూఆర్ కోడ్ ఆప్షన్‌ను పూర్తిగా తొలగించాలి.
2. ప్రస్తుత నిత్యావసర ధరలకు అనుగుణంగా డీలర్ల జీవనభృతిని దృష్టిలో ఉంచుకుని కమిషన్‌ను పెంచాలి.
3. పంపిణీ సమయంలో ఎదురవుతున్న సర్వర్, సాంకేతిక లోపాలను సరిచేయాలి. ఈ విధానాన్ని మార్చకపోతే భవిష్యత్తులో పంపిణీ ప్రక్రియ మరింత క్లిష్టంగా మారుతుందని వారు పేర్కొన్నారు. దీనిపై స్పందించిన తహశీల్దార్ వర కుమార్, ఈ సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి తగిన పరిష్కారం కోసం కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో దుర్గి మండల రేషన్ డీలర్ల అసోసియేషన్ సభ్యులు, స్థానిక డీలర్లు పాల్గొన్నారు.

# గర్భస్థ లింగ నిర్ధారణ పరీక్షలపై కఠిన చర్యలు

### వైద్యశాలలు, స్కానింగ్ కేంద్రాల్లో ఆకస్మిక తనిఖీలు చేపట్టాలి

### కలెక్టర్ సి.ఎం. సాయికాంత్ వర్మ



గుంటూరు, అక్టోబర్ 13: (మహి న్యూస్): జిల్లాలో గర్భస్థ లింగ నిర్ధారణ పరీక్షలను అరికట్టేందుకు వైద్యశాలలు, స్కానింగ్ కేంద్రాల్లో తరచూ ఆకస్మిక తనిఖీలు, డెకాయ్ ఆపరేషన్లు నిర్వహించాలని జిల్లా కలెక్టర్ సి.ఎం. సాయికాంత్ వర్మ అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లో గర్భస్థ పిండ లింగ నిర్ధారణ నిషేధ చట్టం (పీసీ-పీఎన్‌డీటీ), సహాయక పునరుత్పత్తి సాంకేతికత (ఏఆర్టీ) చట్టాల అమలుపై జిల్లా స్థాయి కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ లింగ నిర్ధారణ పరీక్షలు నిర్వహించే వైద్యులు, స్కానింగ్ కేంద్రాల నిర్వాహకులపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. స్కానింగ్ కేంద్రాలు ప్రభుత్వ నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని సూచించారు. లింగ నిర్ధారణ పరీక్షలను పూర్తిగా అరికట్టేందుకు కమిటీ సభ్యులు, స్వచ్ఛంద సంస్థలు సమన్వయంతో పనిచేయాలని తెలిపారు. ఈ సమావేశంలో అదనపు సెషన్స్ జిల్లా న్యాయమూర్తులు వై. నాగరాజా, వెంకట నాగ శ్రీనివాసరావు, జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ ఎం. పద్మావతి, డీఎస్పీ సీతారామయ్య, ఐసీడీఎస్ పీడీ ప్రసూన, డెమో సాంబశివారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ఎల్‌నినో ప్రభావం నుంచి పంటల రక్షణకు ప్రకృతి వ్యవసాయ పద్ధతులు

### రైతులకు అవగాహన కల్పించే పుస్తకాన్ని విడుదల చేసిన కలెక్టర్



గుంటూరు, అక్టోబర్ 13: (మహి న్యూస్): ఎల్‌నినో ప్రభావం నేపథ్యంలో ప్రకృతి వ్యవసాయ పద్ధతులతో పంటలను రక్షించుకునే విధానాలపై ప్రకృతి వ్యవసాయ విభాగం రూపొందించిన పుస్తకాన్ని జిల్లా కలెక్టర్ సి.ఎం. సాయికాంత్ వర్మ మంగళవారం విడుదల చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎల్‌నినో ప్రభావంపై రైతులకు స్పష్టమైన అవగాహన కల్పించాలని సూచించారు. ప్రకృతి వ్యవసాయ పద్ధతుల ద్వారా పంటలను సంరక్షించుకొని ఆర్థిక నష్టాలను తగ్గించుకునే విధానాలను రైతులకు వివరించాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి ఎన్.ఎస్.కె. ఖాజావలి, జిల్లా వ్యవసాయ అధికారి ఎం. పద్మావతి, ప్రకృతి వ్యవసాయ డీపీఎం రాజకుమారి తదితరులు పాల్గొన్నారు.

# శ్రీ అన్నపూర్ణాదేవి అలంకారంలో శ్రీ లక్ష్మీ అమ్మవారు

### అడిగొప్పలలో వైభవంగా శరన్నవరాత్రి పూజలు



మాచర్ల, అక్టోబర్ 13: (మహి న్యూస్): పల్నాడు జిల్లా మాచర్ల నియోజకవర్గం, దుర్గి మండలం అడిగొప్పల గ్రామంలో కొలువై ఉన్న శ్రీ నిదానంపాటి శ్రీ లక్ష్మీ అమ్మవారి దేవస్థానంలో దేవి శరన్నవరాత్రి ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో వైభవంగా కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా మూడో రోజు శ్రీ అన్నపూర్ణాదేవి రూపంలో అమ్మవారికి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అమ్మవారిని భక్తిశ్రద్ధలతో అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించగా, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఆలయ ప్రాంగణం భక్తుల సందడితో ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంది. అన్నపూర్ణాదేవి అనుగ్రహంతోప్రజలందరికీసుఖసంతోషాలు,ఆయురారోగ్యాలు,అష్టైశ్వర్యాలు కలగాలని భక్తులు ప్రార్థించారు.

EDITOR and PUBLISHER and OWNED BY NEELI RAMASUBBAIAH, PUBLISHED AT 1/702, BEHIND BHARAT PETROL PUMP, GUNTUR, A.P - 522001.PRINTED AT VSAR PUBLICATIONS178/1, ANJANEYA VAGU, KOTHAPETA,VIJAYAWADA (URBAN), N T R, A.P -520001. RNI NO : APTEL/26/A7632. Cell 90 59 58 58 98. Email : mahinewsindia@gmail.com, website : https//epaper.mahinewsindia.com